సముద్రపు అంచులు

శ్రీ బాలగంగాధర తిలక్

మసక మసక చీకట్లో పల్లెవాళ్ల గుడిసెలన్నీ చిన్ని చిన్ని పడవల్లా వున్నాయి. ఇక్కడా అక్కడా యిసుక నేలమీద కూర్చుని పొడుగాటిచుట్టలు కాల్చుకుంటూ పల్లెవాళ్లందరూ కబుర్లు చెప్పుకుంటున్నారు. దూరంగా సముద్రపు హోరు వినబడుతోంది. సముద్రం మీదనుంచి వచ్చే చల్లని ఉప్పనిగాలికి గుడిసెలమీద ఆకులు కదలి చప్పుడు చేస్తున్నాయి. చూరుల్లోంచి నల్లనల్లని పొగా, చేపలకూరవాసనా రుచి రుచిగా వెగటువెగటుగా వస్తున్నాయి.

ఈ మధ్య వీరయ్య వాళ్లందరితోనూ కలవడం లేదు. తన గుడిసెముందు ఒక పెద్ద బండరాయిమీద కూర్చుని తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. తమ్ముడు నూకయ్య ఆరేసిన చేపలన్నిటినీ యీ తాటాకుబుట్టలలోకి ఎత్తుతున్నాడు. అక్కడికి కొంచెం దూరంలో మీసాల వెంకన్న నవ్వు బొంగురుగా బోదురుకప్ప అరచినట్లుగా వినవస్తోంది.

'ఓ మాఁవా. నా వొల్లు నీవొల్లుకు తగిల్తే నీ జబ్బు ఒదల్తది' అన్న నరసమ్మ ఆడగొంతు సన్నగా విభిన్నంగా వినపడుతోంది. ఆ గుంపుకాని, వాళ్ల కులాసాగాని వీరయ్యని ఆకర్షించలేదు.

'అన్ని సేపలూ లోపలెట్టాను. మరేంటి సేసేది?' అన్నాడు నూకయ్య చేతులు దులుపుకుంటూ.

'ఏంటీ లేదు.' వీరా తమ్ముడికేసి చూసి అన్నాడు. 'ఎల్లి గంజాగ్చు. నా కాకలేతంది.'

నూకయ్య గుడిసెలోకి వెళ్లిపోయాడు. వీరయ్య తన ఆలోచనలో ఆగినచోటు కనుక్కొని ముందుకు సాగాడు.

వీరయ్య అదృష్టం యీవాళ పండింది. తన జీవితంలో అన్ని చేపలు ఎప్పుడూ తను చూడలేదు. పెద్దవీ చిన్నవీ రంగురంగులవీ బలిష్ఠమైనవీ-తన గుడిసె పట్టనన్ని చేపలు దొరికాయి. రోజూ ఏకాపుగా వెళ్లిపోయే తన బ్రతుకులో ఏదో ఆశ కదలి మిలమిల లాడింది. పెద్ద చేపకి రెండు రూపాయలు తక్కువ రావు. తనకున్న చిల్లర అప్పులూ బాకీలూ అన్నీ తీర్చుకోవచ్చును. పైగా పొరుగూళ్లో దగ్గుతో బాధపడే ముసలి తండ్రికి ఓ దుప్పటీ, తమ్ముడికి రెండు యిజార్లూ కొంటాడు. చంద్రికి - తక్కువలో వస్తే ఎర్రంచుల ఆకుపచ్చ చీర ఒకటి కొంటాడు.

ఈ వేళ బాబు దగ్గరుంటే ఎంత సంతోషించును! పుట్టినప్పట్నుంచీ యిక్కడేవుండి ఈ చేపల నమ్ముకుంటూ తింటానికి తిండలేక—పాపం, చివరికి కీళ్ల జబ్బు వచ్చి ఊరుకొని వూళ్లో ఒక్కడూ ఉంటున్నాడు. సత్తెమ్మ మాత్రం ఏదో యింత కాచి పోస్తోంది.

ఊరువిడిచి వెళ్లిపోతూ యిలా అన్నాడు బాబు: 'అబ్బీ! ఈ సముద్రం నా పానాలు మింగేసింది. ఈ మామ్మోరిని వదలి కూలిపని చేసుకో కుర్రాడా.'

నిజంగా యీ సముద్రం అంటే తనకీ ఎంతో భయం. చిన్నప్పట్నుంచీ యీ సముద్రాన్ని తా నెరుగును—ఆ యిసుకవొడ్డునీ, బలంగా కోపంగా వస్తూ తక్కున విరిగిపోయే కెరటాల్నీ, లోతులకి చొచ్చుకుపోయే నీలాల్నీ, లోతు లోతుల్నీ మెరకల్నీ అతనెరుగును. ఇంకా నూరీడు దూరంగా సముద్రంలోంచి ఎర్రగా పైకి లేవకముందే పడవచెక్క లమర్చుకుని, నూకయ్యని కూర్చోపెట్టుకుని నీళ్లల్లోకి వెళ్లిపోతాడు. కొండ అంచులు తడిసిపోయే చివరికంటా వెళతాడు వలవేస్తూ తీస్తూ. సంజెవేళకి ఒళ్లంతా నొప్పులతో కొత్తగా భయంగా భూమ్మీద అడుగుపెడతాడు. శ్రమతప్ప ఏమీ లాభం కనపడదు. ఏమైనా ఉన్నట్టయితే పన్నులు వసూలుచేసే చౌదరి ఆ కాస్తా కాజేస్తాడు.

అటువైపంతా భూమి! అంతులేని భూమి. పచ్చగా నల్లగా గట్టిగా ఎక్కడికో ఎక్కడికో పరచుకుని కోట్లకోలది జనానికి తల్లిలాగా ఆధారంగా వుంది. ఆ భూమ్మీద వుండేవాళ్లకి ఎందుకో బలమూ నవ్వూ కులాసా వుంటాయి. అక్కడ భూమ్మీద తనూ చంద్రీ యిటికలతో కట్టుకున్న ఓ చిన్న యింట్లో వుంటే—

మరి తను ఎందుకు భూమి అంతమయిందని తెలిపే యిక్కడ—యీ జాలిలేని సుఖంలేని సము

ద్రపు ఉప్పుని నీళ్ళల్లో తన తిండిని వెతుక్కుంటున్నాడు ఆ సముద్రంలో వుండే చేపలలాగా? తాను కూడా భూమ్మీదకి వెళ్లి బ్రతకలేడా? ఇలాగ శ్రమపడి తనూ బాబులాగ అయిపోతాడా? మొన్న మొన్న రంగణ్ని చూశాడు! తనలాగే మాంచి వయస్సులో ఉన్నవాడైనా, పెదవులదగ్గర యేడుపులాంటి నవ్వూ, కళ్లచుట్టూ నల్ల నల్లని ముసలితనం వేలాడుతూండడం చూస్తే తనకి బెంగా దిగులూ కలిగాయి. చౌదరి మొన్న పెళ్లంతో పిల్లలతో షికారువచ్చాడు. నిండుగా పచ్చగా గుమ్మడితీగలాగా ఉన్నారు. దేబరితనం విసుగూ రోతా వాళ్ళ మొహాల్లో లేవు. తనకీ అలా ఉండాలనిపిస్తుంది. మీసాల వెంకన్నలాగ పెళ్లి చేసుకోక ఒళ్లుపాడైపోయిన నీతిలేని నరసమ్మచుట్టూ తిరుగుతూ అసహ్యంగా మోటుగా అయిపోతే! ఛీ-ఆ నరసమ్మలో ఏముంది? పెద్దపెద్ద రొమ్ములేసుకు తిరిగితే తను లోబడతాననుకుంది కాబోలు, చంద్రి తనకి వుండగా యిలాంటి ముండల్ని తనదగ్గరకి రానిస్తాడా? సత్తెమ్మని చూస్తే తెలియడంలేదూ, బాబు పెద్దపెద్ద కండల్నీ గుండెల్నీ తినేసింది!

వీరయ్య గుండెలో రూపాయలు చప్పుడయాయి. గట్టిగా నవ్వాడు. నవ్వు గాలిహోరులో మడతలుపడిపోయింది. గుడిసెలోంచి చేపలకూరవాసన వస్తోంది. ఇంతలో వెంకన్న వీరాయింటివైపు వస్తున్నాడు. వెనకాల ముగ్గురు నలుగురు బెస్తవాళ్ళున్నారు. నరసమ్మ ముందుగా నడుస్తూ ఏదో పదం పాడుతోంది— చేతులుతిప్పుతూ.

'ఇయ్యాల రేతిరికొత్తాను యీరయ్యమాఁవా' అంది నరసమ్మ. అందరూ నవ్వారు. వీరయ్య యేవగింపుతో 'పోయే ముండా' అన్నాడు. వెంకన్న ముందుకొచ్చి 'ఏం, నీసెందిరికన్న బాగూనేదూ?' అన్నాడు.

'దానితోసాటేంటి ఛూ!' అన్నాడు దూరంగా జరిగి వీరయ్య.

'యీపు సెక్కగుర్తది జాగత్త' అన్నాడు వెంకన్న.

'ముందు నీయీపు సూసుకో.' నిర్లక్ష్యంగా అన్నాడు వీరయ్య. నరసమ్మ కొప్పు సవరించుకుంది. గాజులు గలగలలాడేటట్టు చెయ్యివూపుతూ 'సూత్తాంగా నీ సెంద్రమ్మగుణం. నీకు తెలీకుండా అది...' అంటూ ముందుకు సాగిపోయింది.

వెంకన్న భళ్ళున నవ్వుతూ ఆమెవెనకాలే వెళ్ళాడు. 'అబ్బో? మాలావు పెద్దమడిసే యీడు' అన్నాడు. అందరూ మరింత పెద్దగా నవ్వి అక్కణ్ణుంచి కదలిపోయారు.

కొంచెంకొంచెం వెన్నెల వస్తోంది. వెళ్ళిపోయే నరసమ్మనీ వెంకన్ననీ చూస్తూ ఉండిపోయాడు వీరయ్య. తమ్ముడు గుడిసెలోంచి పిల్చాడు. వొళ్లు విరుచుకుని నిర్లక్ష్యంగా నవ్వుకుంటూ లోపలికి వెళ్లాడు.

వీరయ్యకి వడ్డించి నూకయ్య కుండపెంకులో తనకి అన్నం పెట్టుకున్నాడు. బుడ్డిదీపపు వెలుగులో యిద్దరూ వికృతంగా ఉన్నారు.

'ఎన్నిరూపాయ లొత్తయ్ నిజం సెప్పు.' అన్నాడు నూకయ్య.

'యాబై.'

'అమ్మో అమ్మో!' నూకయ్యనోట్లో ముద్ద ముద్దలాగే వుండిపోయింది.

'ఆడు—ఆయెంకన్న కళ్లోడ్డోసుకుంటన్నాడు' అన్నాడు వీరయ్య.

'ఏంసేస్తవ్ అంత డబ్బు?' అన్నాడు నూకయ్య. వాడిదృష్టి డబ్బుమీదే వుంది.

'నీకోలాగూ సొక్కా కుట్టిత్తాలే.'

నూకయ్య గబుక్కున చప్పట్లు కొట్టాడు. ఎడం చెయ్యికూడా పులుసుతో తడిఅయింది. తొందరగా కాళ్లకి రాసేశాడు. ఇంక తన్ని పంచభూతాలూ చులాగ్గా స్వంతంలాగ స్పృశించలేవు. తను వాటిని తొడుక్కుని తిరణాల కెళ్లితే...!

'సెందిరికో సీర కొంటాను' అన్నాడు వీరయ్య.

'అమ్మో అమ్మో!'

'బాబుకో దుప్పటీ కొంటాను.'

'అమ్మో అమ్మో!'

'పాపం బాబు ఏంసేత్తుండాడో ముసిలోడు.'

నూకయ్య దిగులుపడ్డాడు. బాబుని చూడాలనే కోరిక వాడిలో చాలాకాలంనుంచి గూడుకట్టుకుని వుంది.

'మరి డబ్బంతా అయిపోనాక ఏంటి సేసేది?' అన్నాడు నూకయ్య కాస్సేపు ఆలోచించి.

వీరా మొహం నల్లపడింది. డబ్బుతో యిదీ అదీ కొంటే యింక మిగిలేది ఏమీ ఉండదనే జ్ఞానం చురుక్కున గుండెకి తగిలింది. తిరిగి డబ్బులేక ఆ సముద్రపు

నీళ్ళల్లో గెడవేసుకుంటూ పోవాలి. అలాగే బతికి నన్నాళ్లూ పోతూవుండాలి. వీరయ్యకి కోపం వచ్చింది. కంచం ఓపక్కకు విసురుగా తోసి యిలా అన్నాడు:

'ఏంట్రా నూకా, నీ కూ్కడెట్టాలి. ముసిలోడికి డబ్బివ్వాలి. ఎవడు సేతా డిదంతా. తెచ్చిన కూంతా మీకే అయిపోతది. పో, నువ్వు వేరేపోయి నీ బతుకు నువ్వు చూసుకో. నాకెందుకు మీ అందరి వూనూ.'

అన్న హఠాత్ కోపం నూకయ్యకి అర్థంకాలేదు. ఏడుపు వచ్చింది. వీరయ్య యివతలకి వచ్చి బండమీద కూర్చుని చుట్ట ముట్టించాడు. తిన్న అన్నమంతా కడుపులో విరిగిపోయినట్టయింది. ఆ చౌదరిలాగా ఖర్చు పెట్టినా తరగని డబ్బు ఎలాగ సంపాదించడం? తన సెందిరిని మనువుసేసుకుని ఒక చిన్న యిల్లు కట్టుకోవడం ఎలాగ? ఈ సమస్యకి తుది మొదలూ తేల్చుకో లేక వీరయ్య నిస్సహాయంగా ఆకాశంలోకి చూస్తూ కూర్చున్నాడు.

గుడ్డివెన్నెల అంతటా ఆవరించుకుంది. పల్లె వాళ్ళ గుడిసెల నీడలు పొడుగ్గా సాచుకుని వున్నాయి. ఇసుక నేల తరంగాలులేని సముద్రంలాగ వుంది. ఓ ముసిలివాడు కర్రని చప్పుడుచేస్తూ అడుగులో అడుగు వేసుకుంటూ వీరయ్య దగ్గరకే వచ్చాడు.

'ఓస్. గవరయ్యమాఁవా. రారా' అంటూ లేచి వీరయ్య ముసలాణ్ణి జాగ్రత్తగా బండమీద కూర్చోపెట్టాడు. గవరయ్యకి కళ్ళు కనపడవు. బాగా వంగిపోయాడు. ముసలివాడైపోయాడు. 'ఏరా యీరా. బాగాసేపలుపడ్డయిటగా' అన్నాడు.

'ఏదోలే మాఁవా.'

'సరిసర్లే. అందరూ యిదేమాట. జాగ్రత్తరోఅబ్బీ. పదిలంగావుండు. అందరికీ శానాకష్టంగా వుంది.'

'తల్లేదేం తిన్నానా ?'

'ఈమాట సొప్పటానికే వొచ్చార్నా. పోతా పోతా' అంటూ ముసలాడు లేచాడు.

'మళ్లీ అంతదూరం యెల్ల లేవు. ఇక్కడే తొంగో మాఁవా' అన్నాడు వీరయ్య.

'రోజూ మీఅత్త కల్లోకి వత్తందిరా. నన్ను కూడా రమ్మంటందిరా' అని ఆగి గవరయ్య 'బాబూ యిలారా' అన్నాడు. వీరయ్య దగ్గర కెళ్ళాడు. వీరయ్య వొళ్ళు నిమురుతూ 'ఇంక ఎప్పుడో జీవుడు లేచిపోతాడ్రా అబ్బీ. సత్తే నా గుమ్మం దగ్గరే సత్తాను. అక్కడే మీ అత్తా పానం వదలింది. ఓమారు నిన్ను సూద్దామని బుద్ధయింది. మనోళ్లల్లో మీరే గదరా మిగిలిందీ. ఏడీ నూకడు నిదరోనియ్యి. లేపమాకు' అంటూ వణుకుతూ కర్రతో దారి చూసుకుంటూ గవరయ్య వెళ్లిపోయాడు. వీరయ్య గుండెల్లో తెలీని బాధ కలిగింది. గవరయ్య చెల్లెలే తన తల్లి. మామ చెప్పినట్టు మూడు నాలుగు కుటుంబాలు బందరు వదలి ఎప్పుడో యీ వూరు వచ్చేశారు. ఇక్కడ ఒక్కొక్కళ్ళే సముద్రానికీ ఆకలికీ రోగాలకీ ఆహుతి అయిపోయారు. తనే మిగిలాడు. గవరయ్య మామ కూడా చచ్చిపోతాడు. బాబుకూడా చచ్చిపోతాడు. గవరయ్యమామకి అత్తంటే ప్రాణంలో ప్రాణం. ఆమె పోవడంతో మతిలేనివాడైపోయాడు. అత్త తనకి చేగోడీలు చేసిపెట్టేది. అత్తి చచ్చిపోయింది. అందరూ చచ్చిపోయారు. తన కెవరున్నారు? బారుమని ఏడవాలనిపించింది. కాని చంద్రి జ్ఞాపకం వచ్చింది. తమ్ముడు నూకడు జ్ఞాపకం వచ్చాడు. గబగబా గుడిసెలోకి వెళ్ళాడు. నూకడు నేలమీద పడుకుని నిద్రపోతున్నాడు. వాడి కళ్ళచుట్టుకారిన నీటిచార బుడ్డిదీపపు వెలుగులో నల్లగా కనపడుతోంది: వీరయ్య పరీక్షగా చూశాడు. వాడి వళ్ళంతా ప్రేమగా తడిమాడు. అక్కడున్న నులకమంచం వాల్చి, తమ్ముణ్ణి రెండుచేతులతో ఎత్తి దానిమీద పడుకోబెట్టాను. తానొక చదర తీసుకుని బయటికివచ్చి, యిసుకమీద పరచాడు.

'చెంద్రి రాలేదేం యియ్యేల' అనుకున్నాడు గట్టిగా. ఇంకా ఆశతో ఆమెకోసమే అన్నట్టు చూస్తూ చదరమీద కూర్చున్నాడు.

2

వెన్నెల మరికాస్త వచ్చింది. నీడలు చిన్నవయాయి. పల్లె అంతా నిశ్శబ్దంగా ఉంది. కొందరు మాత్రం యిళ్ళ కివతల యిసుకలో పడుకున్నారు. అర్థంలేకండా అంతటా వ్యాపించిన ఆకాశాన్నీ చుక్కల్నీ చూస్తో పడుకున్న వీరయ్యకి క్రమంగా నిద్ర పట్టింది.

నిద్రామాయ మసక మసక మడతల్లో జడమైన వీరామనస్సుకి ఏదో తగిలినట్టయింది: కళ్ళు తెరిచాడు.

'అస్సె—ఏంటదీ' అన్నాడు బద్ధకంగా. కిలకిల నవ్వింది నరసమ్మ. 'అపుడే నిదరేంటీ?' అంది.

వీరా దూరంగా ఒత్తిగిల్లాడు. చెవులు దాటి జుట్టుపడుతూంటే, వెనకాల ముడిచుట్టుకుని రవిక

లేకండా పైటకప్పుకున్న నరసమ్మని చూశాడు. తన కోసమని ఒక్కతే యిలా రావడం కొంచెం గర్వం కలిగించింది వీరయ్యకి.

'ఏం యిలాగొచ్చినావ్?'

'రాకూడదేంటీ!'

'పైట సరీగ్గా యేసుకో, సిగ్గులేదూ.'

'నీ దగ్గరేనా యీరయ్య మాఁవా.'

నరసమ్మదగ్గరగా జరిగింది. ఆమె చనువు వీరాని కంగారుపెట్టింది. కాని అతనికి మీసాల వెంకన్న జ్ఞాపకం వచ్చాడు. ఏదో చీదరగా అనిపించింది.

'ఇయ్యాల మాంచి లాబం వత్తదేంటీ' అంది నరసమ్మ గోముగా.

'ఎంతలే – ఓ యాభైరూపాయలు' గర్వంగా అన్నాడు వీరయ్య.

'యెన్నెల బాగుం దీరయ్యమాఁవా.'

వీరా మాట్లాడలేదు.

'ఇక్కడ నీపక్కనే కూంతసేపు నడుం వాలుత్తా-ఏం?'

వీరా తటపటాయించాడు. నరసమ్మ నవ్వింది. దగ్గరగా వెల్లకిత్తలా పడుకుంది.

వీరా తన చిక్కని నల్లని మీసం సవరించుకున్నాడు. బిగువైన ఆమె రొమ్ము గుండ్రని పిక్కలూ వీరా మనస్సుని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. వెన్నెలరాత్రీ, స్త్రీసామీప్యమూ, దృఢమైన అతని ఆరోగ్యమూ మనిషి హేతువును మించిన హేతువుకి ఉద్దీపకాలుగా వున్నాయి. ఇటూ అటూ చూశాడు. నిద్రలో నిశ్శబ్దంలో మునిగివుంది పల్లె అంతా. దూరాన గుడిసెలోంచి ఏదో సన్నని ఏడుపు వినవస్తోంది.

'కిందనే తొంగున్నావు నరసమ్మా. నా సదర తీసుకో' అన్నాడు వీరయ్య.

'ఒద్దులే.'

వీరయ్య అతిప్రయత్నంమీద మరోక పక్కకు తిరిగి 'సాల్లే నీ యేసాలు. నాను లొంగేవాణ్ని కాను' అన్నాడు. నరసమ్మ ఫక్కున నవ్వింది. ఆ నవ్వులో గొప్ప సెర్వూ ధీమా వున్నాయి. అతనిమీద వొరిగి కావలించుకుంది. 'ఎంత కమ్మగున్న వీరయ్య మాఁవా' అంది.

'లేకపోతే యెదవ యెంకన్న నేంటే' అన్నాడు వీరయ్య. ఆమెను పొదివి పట్టుకుని గుండెలకు హత్తుకున్నాడు.

'ఈ మద్దె మహసిక్కయింది' అంది నరసమ్మ.

'ఏంటే...'

'నానున్న గుడిసె అద్దెకి నిక్కచ్చి సేత్తన్నాడు సిల్లిగవ్వ సేదు.'

'ఎంకన్న వున్నాడుగా.'

'రోజూ కల్లోయిత్తాడుగా. ఇంకేం మిగులుద్ది ఆడిదగ్గర?'

నరసమ్మ కౌగిలి విడిపించుకుని పక్కకి జరిగింది. వీరయ్య రమ్మంటూ చేతులు చాశాడు.

'అద్దెమాట ఏం సాప్పావు మాఁవా?' అంది నరసమ్మ.

'రారా' అన్నాడు వీరయ్య.

'అయిదు రూపాయ లప్పిత్తావా?'

'నాదగ్గర నేదు.'

'అదేంటి మాఁవా, నీదాన్ని కాదా?'

'నాదగ్గర నేదు.'

'పోనీ మూడు రూపాయలియ్యి. కట్టం గడుపు.'

'నాదగ్గర నేదు.'

నరసమ్మ చివాలున లేచింది. 'అయితే నేరాను' అంది విసురుగా. వీరాకి కోపం వచ్చింది. సిగ్గు వేసింది. అసహ్యం వేసింది. వెన్నెలలాంటి చంద్రి నవ్వూ స్నేహమూ కళ్ళముంగు నిలిచాయి. 'పోపో ముండా. డబ్బుకోసం వొచ్చినావ్ పింజారిముండా. ఛీ! ఛీ!' అని అరిచాడు.

'ఉత్తినే అన్నాను మాఁవా' అంది నరసమ్మ పరిస్థితి చెయ్యి దాటుతోందని గ్రహించి.

వీరా లేచి చదర తీసుకుని 'ఛీ! ఛీ! నా గుమ్మం కాడనుంచి పో. నిన్ను సూత్తేనే పాపం' అంటూ గబగబా గుడిసెలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు.

బిత్తరపోయిన నరసమ్మ. దగ్గరకి యెంకన్న చాటునుంచి వొచ్చాడు.

'ఏంటన్నాడూ?' అని అడగాడు.

'ఇయ్య నేదు దొంగనాకొడుకు. కాని ఆడివోళ్లు బలేగావుంది.'

3

తెల్లవారగానే పట్నంనుంచి వర్తకులు వచ్చారు. వీళ్లు సేపన్ని బేరంచేసి కొనుక్కు పోయి లాభాని కమ్ముకుంటారు. పెద్దసంత నరసింహులు వీరయ్య గుడిసె దగ్గరకి వచ్చాడు. అతనితోపాటు వెంకన్నా యింకా

కొందరూ కూడా వున్నారు. వర్తకులకి దగ్గరుండి బేరంలో సహాయంచేసి పెద్దరికం వెలిగించి పావలా అర్ధా సంపాదించుకుంటాడు వెంకన్న - అసలు వెంకన్న ఏ గొడవొచ్చినా అక్కడుండి పూనుకుంటాడు. పూసుకుంటాడు. పన్నుల చౌదరితో మంతనాలు సాగిస్తాడు. అందుకే వెంకన్న అంటే అందరికీ కొంచెం భయంకూడా వుంది.

నూకయ్య గుడిసె యివతలే కూర్చొని పల్దోము కుంటున్నాడు. తెల్లని సూర్యకాంతి యిసుకమీద వెండిరేకులా మెరుస్తూవుంది. పల్లెవాళ్ల నల్లని శరీరాలు మరికాస్త నల్లగా నిగనిగలాడుతున్నాయి.

నరసింహులు వెంకన్నవైపు రెండు పొగాకు కాడలు విసిరాడు.

'తీసుకోరా యెంకా. ఈ వీరన్న ఏదైనా సబబుగా యిస్తాడా?' అన్నాడు.

'మా లోబం మడిసండి బాబూ. ఆడికి డబ్బు పోగుసేసి పోగుసేసి మీలాగ అయిపోవాలని వుందండి' అన్నాడు వెంకన్న పుగాకు పాయ తుంపుతూ.

'నీకుమాత్రం లేదట్రా?'

వెంకన్న గర్వంగా అందరికేసీ చూసి యిలాగ అన్నాడు: 'మనకెందుకురా పోగుసేసుకోవడం. ఏరోజు కారోజుదే. యెదవడబ్బు, మనదగ్గరుండదు- అలాటి పెబువులకి కాని.'

నరసింహం వెంకన్నని దగ్గరగా పిల్చి చెవిలో ఏదో చెప్పాడు.

వెంకన్న వికటంగా నవ్వి గుడిసెలోకి వెళ్లాడు. కాస్సేపట్లో వీరాతో యివతలకి వచ్చాడు.

'దండం బాబూ' అన్నాడు వీరయ్య. నూకయ్య చేపలబుట్టలు ఒక్కొక్కటే యివతల పెట్టాడు. పాతిక రూపాయల్నించి .బేరం సాగింది. వీరయ్య ఆఖరుకి యాభై కావాలన్నాడు. దమ్మిడీ తగ్గితే యివ్వనన్నాడు. యాభై అంటే నూర్లో సగం. ఇంకో యాభై సంపాదిస్తే నూరవుతుంది. అదీ వీరయ్యలెక్క. మొదట డెభ్భై చెప్పినా వీరయ్యకెందుకో యాభై అన్న అంకెమీదనే మోజువుంది. ఆ అంకెనుంచి ఎంతచెప్పినా దిగలేదు. ఇక లాబంలేదని నరహసింహం సొమ్మిచ్చి బుట్టలు పట్టించుకు వెళ్ళాడు. వీరా మెరిసే కళ్ళతో అయిదు పదినోట్లనీ మొలకి కట్టాడు. రెండు మూడురోజుల శ్రమకి ఏపల్లెవాడూ ఈమధ్య యింత సంపాదించలేదు. వీరయ్యలాగ పట్టుదలగా వాళ్ళు సముద్రాన్ని గాలించనూ లేదు. ఆపూటగడిస్తే చాలను కుంటారు. మిగిలితే తాగుతారు. వాళ్లల్లో కష్టపడే బలమూ ఓపికా ఇచ్ఛా ఏనాడో లుప్తమైపోయాయి.

'ఓ రెండురూపాయలు నాకియ్యి. మళ్ళీ ఇచ్చేత్తా' అన్నాడు వెంకన్న చెయ్యిజాపుతూ.

'నీకెందు కివ్వాలీ?'

'నాను బేరంచేసి పెట్టాను' అన్నాడు వెంకన్న.

'ఆడితో వొచ్చినావు. ఆడిదగ్గరే పోయి పుచ్చుకో.'

వెంకన్న కోపంగా చూశాడు. వీరా లక్ష్యం చెయ్యక నూకయ్యని పడవచెక్క లమర్చమని పంపించాడు. వెంకన్న వీరాదగ్గరగా వెళ్ళాడు.

'మద్దెవరికి మామూలుంది తెల్సా?' అని కోపంగా అడిగేడు.

'అవసరమైనోడు నాదగ్గరికి ఒత్తాడు. మద్ది నీ ఊసేంటి?'

'నూసుకో నీపని సెప్తా' మీసం దువ్వాడు వెంకన్న.

'పోరా తాగుమోతుకొడకా.'

వెంకన్న కళ్లు ఎర్రపడ్డాయి. హుంకరించాడు. 'మామూలిత్తావా, సెంపదరగొట్టనా' అంటూ మీదకు వెళ్ళాడు. వీరయ్య కలియబడ్డాడు. కుస్తీ ప్రారంభమయింది. తక్కినజనం అందరూ వింతగా సరదాగా చూస్తున్నారు. చప్పట్లు కొడుతువ్నారు. చుట్టుపక్కల గుడిసెల్లోంచి ఆడవాళ్లుకూడా - కొందరు పిల్లల్ని చంకనవేసుకుని మరీవచ్చారు. ఈ కలహానికి కారణమేమిటో ఆతురతతో వాకబుచేస్తున్నారు.

వీరా బలంగా వెంకన్నని తన్నాడు. వెంకన్న గిర్రునతిరిగి యిసుకలో పడ్డాడు. మళ్లీ లేవలేక పోయాడు. నోట్లోంచి నురగవస్తోంటే తుడుచుకుంటూ బూతులు తిడుతున్నాడు. జుట్టునెరిసిన ఒకముసిలాడు యింకా మీదకి లంఘించే వీరయ్యని ఆపి 'ఇంక సాల్లే. నువ్వెళ్లు యీరయ్యా' అన్నాడు. వీరయ్య వొళ్లు దులుపుకొని సముద్రంవైపు వెళ్ళిపోయాడు. వెంకన్న లేచి గాలిలో పిడికిలికొట్టుతూ బూతులు తిడుతూ తూలుతూ వెళ్లాడు. నల్లగా మాసిన గుడ్డలతో చింపిరి తలలతో కళలేని కళ్లతో నీరసంగా వెకిలిగా నవ్వుకుంటూ తక్కినవాళ్ళు విడిపోయారు.

వీరయ్య సముద్రం దగ్గరకి వెళ్లాడు. నూకయ్య పడవని సిద్ధం చేస్తున్నాడు. పక్కనే ఆకుపచ్చ చీర

కొంగు గాలికి ఎగురుతూంటే నవ్వుతూన్న చంద్రి కనపడింది. వీరా 'ఓహోయ్' అని పిలిచాడు. ఆమె కువకువలాడే గొంతుతో 'ఓహోయ్' అని పలికింది.

చంద్రి నలుపైనా అందంగా వుంది. పెద్దకళ్లూ, కోటేరేసిన ముక్కూ, బలంగా వంపులుతీరిన దేహమూ- అన్నిటికన్నా ఆమె స్వచ్ఛమైన నవ్వు, సముద్రపు కెరటాల నురుగు సూర్యకాంతిలో మెరసినట్టుగా అకల్మషంగా హాయిగా నిండుగా ఉంటుంది. చంద్రి పరుగున వెళ్లి వీరా వొళ్లో వాలింది. వీరయ్య రెండు చేతులతోనూ చంద్రిని పైకెత్తి గిర్రున తిప్పి మెల్లగా యిసుకమీద పడుకోబెట్టాడు. ఎండలో ఆమె చెక్కిన రాతి శిల్పంలా నిగనిగలాడింది. ఈమె తనదే నన్న గర్వమూ తృప్తీ అవ్యక్తంగా వీరయ్యలో కలిగాయి. నవ్వుతూ అడిగాడు. 'నిన్న రాలే దేం పిల్లా?'

'నిన్న సేతినిండా పనివుంది బావా.'

'మరి యియ్యాల ఎలా గొచ్చినావ్ సిలకా?'

'నాకు కడుపునొప్పి అని యేడ్చాను.'

వీరయ్య గుండెనిండా నవ్వాడు. తన చేపల్ని గురించీ వచ్చిన సొమ్మును గురించీ చెప్పాడు. చంద్రి కళ్లు పెద్దవి చేసుకు వింది. వాళ్లల్లో సుప్తమైన కలలూ ఆశలూ రేగాయి. ఇద్దరూ దూరంగా భూమ్మీద యిల్లు కట్టుకుని కులాసాగా ఆ చాదరిలాగా...

వీరయ్య పట్టుదలతో అన్నాడు. 'సెంద్రీ సూడు. నెలతిరిగే టప్పటికి మూడొందలు సంపాదిత్తాను. ఇంకా ఇంకా సంపాదిస్తాను. ఈ యెదవపల్లి వొదిలి పోదాం.'

'నాకు సొక్కాలూ' సాగదీశాడు సూకయ్య.

'సర్లే యెదవా. కుట్టిత్తాలే.' వీరయ్య చంద్రి చెయ్యి పట్టి లేవదీశాడు. 'నీకు ఓసీర కొంటాను.'

'నా కెందుకు బావా యిపుడూ.'

'మనువు సేసుకోవద్దూ పిల్లా.'

చంద్రి ఆనందంగా అతనికేసి చూసింది. గబుక్కున సిగ్గుతో తలదింపి 'సాలాఖరుకు నాజీతం వత్తది కదా. అది కూడా నువ్వే తీసుకో' అంది.

'నీ డబ్బెందుకు నాకు పిల్లా. యీరయ్యంటే ఏంటనుకున్నావ్!'

'మరి యిల్లు కట్టుకోవద్దా ఏంటి పిల్లోడా. ఇల్లు కడితే శానా డబ్బవుద్ది.'

వీరయ్య మౌనంగా అంచనా వేస్తున్నాడు. ఆకలీ - రేపటిని గూర్చిన భయమూ లేకుండా గౌరవంగా బతకాలని కోరనివా రుండరు. కాని ఆ పేదరికం పొలిమేర దాటడం కష్టం అని వీరయ్యకి తెలియదు. ఆ పొలిమేర దగ్గర నీచత్వమూ నిరాశా రోగమూలాంటి పెద్ద పెద్ద అగడ్త లుంటాయి. పై అంతస్తులోనికి ఎగరడానికి చేసే ప్రయత్నం అతికష్టమైనదీ అపాయకరమైనదీ కూడా. కాని వీరయ్య ధనం దేనికైనా మూలం అని గుర్తించాడు. కేవలం తన కష్టంవల్లనే తప్ప మరోమార్గం సంపాదనకి లేదనీ తెలుసుకున్నాడు. ఆ వచ్చిన ధనం తన్నిఅంటిపెట్టుకుని ఉండాలి. కాని యీచంచల పదార్థం ఉన్న చోటికే వెళ్లే దుర్గుణం కలిగి వుందని అతనికి తెలియదు. ఏమైనా దారిపొడుగునా జయించుకుపోవాలనే పట్టుదల అతనిలో వుంది. అందుకోసమే తక్కిన తన వాళ్ళల్లో ఉన్న అలసటనీ అవినీతినీ తనలోంచి తుడిచిపెట్టి నియమబద్ధంగా బతకాలనుకున్నాడు. అందుకోసమే నరసమ్మ నెత్తురులేని వలపుకి దూరంగా తొలగాడు.

పడవ సముద్రంలో వూగింది. రెండు కుండలలో గంజీ కూడూ పెట్టి పడవలో ఉంచారు. తెరచాప గాలికి వయ్యారంగా ఆడింది. ఎండముదిరిన వేడికిరణాలు చల్లని సముద్రాన్ని తాకుతున్నాయి. 'నాను కూడు వొండి ఎదురు సూపులు సూత్తాంటాను.' అంది చంద్రి.

'ఇయ్యాల నాసామిరంగా యింకా ఎక్కువ సేపలు పట్టుతాను'అన్నాడు వీరయ్య.

'తొరగారా యేం!' అంది చంద్రి.

పడవ పడుచుపిల్లలాగా కెరటాలమీద సాగింది. చంద్రి చూసి చూసి వెనక్కి తిరిగింది.

4

చంద్రి కేమీ తోచలేదు. ఒకర్త వీరయ్య గుడిసెలో కూర్చుంది. తన కామందుల యింట్లో అయితే యిటువంటప్పుడు విధవకూతురు సుబ్బమ్మ గచ్చనకాయలాడడానికి పిల్చేది. పాపం ఆవిడ చాలా మంచిది. ఏం చేసుకున్నా తీసుకొచ్చి తనకి పెడుతుంది. తనతో ఎన్నో చెపుతుంది. సుబ్బమ్మ మొగుడితో కొన్నాళ్ళు కాపరం చేసింది. ఎప్పుడూ ఆ కాపరం గొడవలే చెప్పేది. ఇప్పటికి తాను అయిదేళ్ళనుంచీ అక్కడే

పనిచేస్తోంది. ఏడాదికి యిన్ని బస్తాలని ఒకేసారి కొలుస్తారు. ఇదివరకు తన తల్లి బతికి ఉన్నపుడు ఆమె జీతం తెచ్చుకు నేది. అన్నగారిని కూడా యింట్లో పెట్టుకుని పోషిస్తూ వుండేది. కాని తల్లి ఏడాది క్రితమే మారకంవచ్చి చచ్చిపోయింది. తల్లి పోవడంతో చంద్రికి సర్వం శూన్యమనిపించింది. మేనమామ వేళకి తిని తత్వాలు పాడుతూ కూర్చుంటాడు. ఇంటిగొడవ పట్టించుకోడు. తనకీ చచ్చిపోవా లనిపించింది. కాని వీరయ్య తనకోసం పల్లెనుంచి మూడుమైళ్ళూ నడిచి వచ్చేవాడు. ధైర్యం చెప్పేవాడు. నవ్వించేవాడు. అల్లరిచేసేవాడు చీకటి పడగానే వెళ్లిపోయేవాడు. వీరయ్యనీ, వీరయ్య కబుర్లనీ తలచుకుంటూనే నిద్రపోయేది. చంద్రి మామూలు మనిషైంది. ఉత్సాహంతో ఆశతో భవిష్యత్తులోకి చూసింది.

చంద్రి గుడిసె తలుపు గొళ్లెంపెట్టి అప్పలమ్మ గుడిసె దగ్గరకు వెళ్లింది. అక్కడ చౌదరి అప్పలమ్మతో ఏదో గుసగుసలాడుతున్నాడు చంద్రిని చూసి 'ఈ పిల్ల వీరయ్యకోసం వస్తూంటుంది కదూ!' అని పరీక్షగా చూశాడు. చంద్రికి ఏదో సిగ్గువేసి కుంచించుకుపోయింది. పన్నులు వసూలుచేసే చౌదరి యిక్కడేందుకున్నాడా అనుకుంది. అప్పలమ్మ అప్యాయంగా చంద్రిని పిలిచి కూర్చోమంది. చౌదరి వెళ్ళిపోయాడు.

'లచ్చిమిలాంటి పిల్లవు. నీరేక మంచిది లే' అంది అప్పలమ్మ సన్నని వంకర చేతులతో చంద్రి చుబుకాన్ని పుణుకుతూ. 'మరి మా యీరయ్యని పెళ్లెప్పుడు సేసుకుంటావో కోడలా?' అంది.

చంద్రి సిగ్గుగా అంది. 'నాకేం తెలుస్తదీ.'

'యీరయ్య సెప్పకోదగ్గ మడిసి. అందరిలాంటోడూ కాడు' అంది అప్పలమ్మ.

'ఇక్కణ్ణుంచి యెల్లిపోదాం. ఊళ్ళో యిల్లు కట్టుకుందామంటాడు. నా జీతంకూడా ఆడికే యిచ్చేస్తాను' అంది చంద్రి.

'ఏమాత్రం నిలవ్వేశాడు నీవోడు' అడిగింది అప్పలమ్మ.

'నాకు తెల్దు.'

'ముసిల్దాన్ని. నాతో ఆమాత్రం సెప్పకూడదేం టే?'

'నాకు తెల్దు. నిజంగా నీమీద వొట్టు.'

'అది సర్లేగాని నువ్వుకూడా యీడకే వచ్చి ఉండరాదూ పిలదానా. ఒక త్రైపీ నువ్వుదూరంగా ఎందుకూ?'

'కామందుల దగ్గర పనికి కుదిరానుగా.'

'ఆఁ పని! పని! ఇక్కడుంటే ఆమాత్రం సొమ్ముసెయ్యమా ఏంటీ-'

'నాకెవరిత్తారిక్కడ?'

'నా దగ్గరుందువుగాని. నా యాపారం మూసిపెడుతూందువుగాని.'

'నాకిటుంటివి సేతగాదప్పలమ్మత్తా.' అంది మాయకంగా చంద్రి.

అప్పలమ్మ చాలా చిత్రమైన మనిషి. దగ్గరగా ఏ భైయేళ్లుంటాయి, చాటుకుండా కల్లునీ ముండల్నీ సప్లై చేసే పెద్ద వర్తకురాలు. కాని ఆమె బహిరంగంగా మాత్రం పుణుకులూ మామిడి తాండ్రా బెల్లపుసెనగచ్చులూ అమ్ముతూంటుంది. పొరుగూళ్ళనుంచి చాటుగా ఎవరికీ తెలియకుండా ఒక్కొక్క రసికుడు ఒక్కొక్క పిల్లని ఎగరేసుకొస్తూంటాడు. వాళ్ళకి గదు లద్దెకిస్తుంది అప్పలమ్మ. ఈ వ్యవహారంలో చౌదరికికూడా వాటావుంది. పోలీసుల చెడుదృష్టి ఇటు పడకుండా చౌదరి చూసుకుంటూ వుంటాడు. కాని చంద్రికి పాపం యివేమీ తెలియవు. అప్పలమ్మ పెద్దకాలపుదనీ సత్తెకాలపుదనీ అమె నమ్మకం.

'పోనీ మా సౌదరిబాబు దగ్గరపనికి కుదరరాదూ పిల్లా. నీకోబస్తా ఎక్కువ ముట్టచెపుతాడు. యీరయ్యకి దగ్గరగా వుంటావు. రోజూ కోశెడుదూరం నడిచివస్తుండావాయె' అంది అప్పలమ్మ.

'మూడు నాలుగు నెలల్లో యీయేడయిపోతదిగా అప్పుడు సూద్దాంలే' అంది చంద్రి, అప్పలమ్మ సలహా కూడా బాగానే వుందనుకుంటూ.

ఇంతలో ఒకగదిలోంచి పెద్ద అరపులూ కేకలూ వినపడ్డాయి. ఒక ఆడగొంతు 'అమ్మో్మ అమ్మో్మ' అంటోంది. దబదబా గుద్దులు వినిపించాయి. చంద్రి భయంతో 'ఏంటదీ?' అంది.

గది తలుపులు తెరచుకున్నాయి. ఒక ఆడదాన్ని జుట్టుపట్టుకుని ఒకడు వూడిన గోచితో తూలుతూ లాక్కువస్తున్నాడు. మధ్యమధ్య కోపంగా విలాసంగా డొక్కలో తన్నుతున్నాడు. ఆమె తిడుతోంది. 'సచ్చినోడు. నీజిమ్మడిపోనూ. నీశార్ధంపెట్ట...'

అప్పలమ్మ ఏమీ ఎరగనట్టు చేపల్ని తరుగుతోంది. చంద్రి సహించలేకపోయింది. 'ఏంట్రా సచ్చినోడ. ఆడమనిసి నట్టాకొడతావ్?' అంది.

'నా యిష్టం.' అన్నాడువాడు.

'అయ్యో అదేం తప్పు చేసిందీ?' అంది చంద్రి.

'నాకు కొట్టాలని సరదా. నీకెందుకే నావూసు.' ఇంతలోకే ఆడమనిషి జుట్టు విడిపించుకుని అతని చెయ్యి కరవబోయింది. అతడు తప్పించుకుని ఆమెని ఎడాపెడా తన్నాడు. చంద్రి అప్రయత్నంగా అంది 'అలా కొడత వేంటె పొగరుపోతుకొడుకా.'

'నీకెందుకే ముండా. నీక్కూడా రెండు తగలాలా.' అన్నాడు ఆవీరుడు. ఆడమనిషి విదలించుకుని పారిపోయింది. అతడూ తూలుతూ ఆమెని వెంబడించాడు. చంద్రికి వికారపెట్టినట్టయింది. కంగారుగా 'ఇదంతా యేంటిఅప్పలమ్మా?' అంది. అప్పలమ్మనవ్వింది. ఆ నవ్వు తాపీగా చిత్రంగా వుంది. అమాయకంగా పరచుకున్న ఎండుటాకుల్ని కాల్చివేసే మంటలోని నిర్దయా, నీచత్వమూ ఆ నవ్వులో ఉన్నాయి. నైతికపు విలువలూ, అంతరాత్మ, జాలీ మొదలైనవన్నీ ఎప్పుడో వదిలేసి అవసరంయొక్క ప్రాముఖ్యానికి లొంగిన మనుష్యులలోని ఒక స్వార్థం, గారపట్టి నల్లపడిన ఆమె పళ్ళసందులలోంచి పొడుచుకు వచ్చిన నవ్వులో అసహ్యంగా పేరుకునివుంది. చంద్రికి ఆ నవ్వు భయంకరంగా తోచింది. ఎందుకో అక్కడ ఉంటే ప్రమాదం అనుకుంది. 'నే వెళ్ళొత్తాను. యీరయ్యబావకి కూడువండాలి' అంటూ అప్పలమ్మ పిలుస్తున్నా వినక చరచరా వెళ్ళిపోయింది.

చంద్రి కూడువండి చీకటిపడే వేళకి బండమీద కూర్చుని పాటలు పాడుతూ వీరాకోసం నిరీక్షిస్తోంది. అటూయిటూ వెళ్ళేవాళ్లూ పలకరించిపోతున్నారు. కొందరు పరాచికాలాడుతున్నారు. మీసాల వెంకన్న కన్ను గీటాడు. 'పోరా యెదవకొడక. కళ్ళల్లో యిసుకోత్తాను' అంది. మరికొందరు కవ్వించి నవ్వుకుంటూ వెళ్ళిపోయారు.

వీరయ్య నూకయ్యతో తిరిగివచ్చాడు. ఈ వేళ కూడా చేపలు బాగానే పడ్డాయి. చంద్రి వేణ్ణీళ్లు కాచిపెట్టింది. ఇద్దరూ స్నానంచేశారు. చంద్రి నవ్వుతూ కబుర్లు చెబుతూ వేడివేడికూడు పెడుతూంటే వీరయ్యకి మగతలాంటి ఆనందం ఏదో కలిగింది. తను రోజంతా పడిన శ్రమని ఎవరో మంత్రం వేసి తీసేసినట్టయింది. చంద్రి యింక యింటికి వెళ్లనంది. ఇక్కడ యీ పల్లెలో సంబరం జరుగుతుంది. చూస్తానంది. సరేనన్నాడు వీరయ్య.

మూతి తుడుచుకుంటూ వీరయ్య యివతలికి రాగానే ఎవరో వచ్చి 'మీ మావకి పానంమీద కొచ్చింది' అని చెప్పాడు. వీరయ్యకి వొళ్ళు జలదరించినట్టయింది. సరాసరి మేనమామయింటికి వెళ్లాడు. గుడిసె గుమ్మంమీద సీతాలు ఏడుస్తూ కూర్చుంది. మేనమామ గవరయ్య పిల్లలు లేరని దీన్ని చేరదీసి పెంచాడు. పన్నెండు పదమూడేళ్ళుంటాయి. 'ఏంవే సీతీ! ఏడుత్తావేం. ఎట్టాగున్నాడు మావ?' అన్నాడు వీరయ్య.

'ఆకలేత్తుంది' అంటూ బావురుమంది సీత.

గవరయ్యకి జబ్బు చెయ్యడంతో సీతాలికి రోజంతా ఉపవాసమైంది. ఇంట్లో బియ్యం గింజకూడా లేకుండా చూసి యిదే సమయం అన్నట్టు మంచం పట్టాడు ముసలాడు. వీరయ్యలోపలికి వెళ్లాడు. గవరయ్య ఒక కుక్కి మంచంలో స్పృహ లేకండా పడి ఉన్నాడు. ఆయాసంతో గుండె లెగిరిఎగిరి పడుతున్నాయి. బలవంతంగా తీసివిడిచే శ్వాస. గురకబరుకు బరుకు మంటోంది. నెరసిన కనుబొమ్మలకింద రెప్పలు సగం మూసుకునిఉన్నాయి. వీరయ్యకి బాధ కలిగింది. జాలివేసింది. ఓపిక ఉన్నన్నాళ్ళూ సముద్రంలో గెడవేసి బతికాడు. చివరరోజుల్లో యిక్కడా అక్కడా అడుక్కు తీసుకువస్తున్నాడు. ఇప్పుడింక యీ ప్రాణావశిష్టుణ్ణి ఎవరు చూస్తారు? కొన్నిరోజులక్రితం అత్త పిలుస్తోందని చెప్పాడు. ఇప్పుడు వెళ్ళిపోతున్నాడా? అక్కడ ఆలోకంలో అత్త యితనికోసం కనిపెట్టుకుని వుంటుందా? అక్కడ తిండిఉంటుందా? అక్కడ సముద్రం వుండదా? ఇలాగ అయోమయంగా ఆలోచిస్తూ పరుగెత్తుకువెళ్లి మంగలిస్వామిని తీసుకొచ్చాడు. స్వామీ మంచి వైద్యుడని ప్రతీతి. గవరయ్యని పరీక్షించి నోట్లో ఏదో రసం పిండాడు. ఉదయానికల్లా తెలివొస్తుందని నయమౌతుందనీ ధైర్యం చెప్పి వెళ్ళిపోయాడు.

'నీకు నేను కూడు పంపిత్తాను. ఎడవ మాకు సీంతీ. మాంవని జాగ్రత్తగా నూత్తూ వుండు.' అని చెప్పి వీరయ్య యింటికి వచ్చేశాడు. చంద్రి అన్నం ముంతలో పెట్టుకుని సీతాలు దగ్గరికి వెళ్లింది.

వీరయ్య గుండెలో బాధ ఎక్కువయింది.

ఈ పల్లె వదలితేగాని తనబాధ తగ్గదనుకున్నాడు. ఎన్నాళ్లయినా తాను కష్టపడి డబ్బు కూడపెడతాడు. అవసరమైతే చంద్రి జీతం కూడా తనే తీసుకుంటాడు. దూరంగా అక్కడ ఒక యిల్లు కట్టుకుని చిన్న వర్తకమో మరొకటో చేసుకుంటాడు. తను చొక్కాలు కూడా తొడుగుతాడు. కాళ్ళకి జోడులేకండా నడ

వడు. చంద్రీ నూకయ్యా తనతో వుంటారు. చంద్రికి తనకీ పిల్లలు పుడతారు. వాళ్ళకి చంద్రిలాగ పెద్ద కళ్లూ, తనలాగ బలమైన దేహమూ ఉంటాయి. వాళ్లు పలకా పుస్తకా లుచ్చుకుని బడికివెళ్లి చదువుకుంటారు. తిన పెద్దమనిషి అవుతాడు. గౌరవంగా హాయిగా బతుకు తాడు. కొందరేనా తన్ని వీరయ్యగా రంటారు.

ఈ దరిద్రపు నీచపు మోసపు సముద్రంతో తను కింక పనిలేదు. మీసాల వెంకన్న తిండిలేక దిక్కు లేక పడఉంటాడు. నరసమ్మ కల్లుతో జబ్బులతో ముసలిదై వంగిపోతుంది. ఈ పల్లెవా ళ్ళందరూ ఆక లితో, రేపటిని గూర్చిన భయంతో క్రమంగా కృశించి నశించిపోతారు. అప్పలమ్మని ఖైదులో పెడతారు. తనుమాత్రం దూరంగా సుఖంగా...

అంత కసిలోనూ ఏడుపు వచ్చింది వీరయ్యకి. ఆ పల్లెనీ అందులో ప్రతీ మనిషినీ తా నెరుగును. తర తరాలుగా వీళ్ళందరూ యిక్కడ పుట్టారు. పెరిగారు. తనవంటి వీళ్ళందరూ నశించిపోతారు. ఈ వందల కొలదీ జనానికి ఏ ఆశా సౌఖ్యమూ యింక జీవితంలో కలగవా? బాబు కూడా యిలాగే చెప్పాడు. 'నాను యీ సముద్రం దేవు డనుకున్నానురా అబ్బీ! మన తాత ముత్తలు యిక్కడే పుట్టారు. పెద్దోళ్లయారు. కాని గుడిసె ఏనాడూ కాస్త పెద్దది అవలేదురా బుల్లోడా! ఈ సముద్రం మనకి కూంత తిండిపెట్టి మనసత్తువ నంతా -మనపానాల్నే బలికోరుద్ది'

అక్కడే యిసుకమీద పడుకున్నాడు వీరయ్య. మాగన్నుగా నిద్రపట్టే వేళకి చంద్రి తిరిగి వచ్చింది.

5

దూరంగా డప్పులు మోగాయి. కాగడాల కాంతి ఎర్రగా కనిపిస్తోంది. జనం కలకలం వినవస్తోంది. చంద్రి వీరాన్ని తట్టిలేపింది. 'నువ్వెళ్లు. నేను ఎనకాన వొత్తాను' అన్నాడు వీరయ్య బద్ధకంతో. చంద్రి నూకయ్యాని తీసుకుని వెళ్లింది. ఇదివర కెప్పుడో చౌదరి కొనియిచ్చిన చమ్కీచీర కట్టుకుని వచ్చింది నరసమ్మ. వెంకన్న ఒక చేతిలో కల్లుముంతతోనూ మరో చేతిలో కొరడాతోనూ తిరుగుతూ జనాన్ని అద లిస్తున్నాడు. గంగడు తుప్పుపట్టిన కత్తినొకదాన్ని తిప్పుతూ ఖడ్గవిద్యని ప్రదర్శిస్తున్నాడు. ఒక ఆడది మొహం అంతా పసుపు రాసుకుని చేత్తో ఆకులు పట్టు కుని జుట్టు విరబోసుకుని గుడ్లు తేలేసి యిటూ అటూ వూగుతోంది. ఇద్దరు వొంటికి రంగులు పూసుకుని పెద్ద పులి ఆట ఆడుతున్నారు. కాగడాల కదిలే వెలుతు రులో అందరూ తెరమీద బొమ్మల్లా మిథ్యగా వింతగా వికృతంగా ఉన్నారు. చంద్రి ఉత్సాహంతో గుంపులో చేరి ఒకటైపోయింది.

క్రమంగా సంబరం మజా ఎక్కువయింది. ముంత లతో కల్లుని కాళీచేస్తున్నారు. పైటజారిన నరసమ్మ కేకలు వేస్తోంది. పసుపు రాసుకున్న ఆడమనిషి వీరాంగం తొక్కుతోంది. ముత్యాలు మొగ్గలు వేస్తున్నాడు. వెంకన్న కొరడా ఝుళిపిస్తూ హెచ్చరిస్తూ గుడివైపు దారితీశాడు.

చంద్రి ఒకపదం అందుకుంది. చంద్రి గొంతు కీచుగా రేగి డప్పులమోతని దాటి ఎర్రని వెల్తురులో కలసిపోతోంది. పదిమంది ఆమె చుట్టూ మూగి వంత పాడుతున్నారు. వెంకన్న వచ్చి చంద్రికి ఎదురుగా నిలబడి 'వహవ్వా సక్కని సుక్కా మరో పదం పాడు' అన్నాడు. ఒకడొక చచ్చిన పాముని తీసుకు వచ్చి విసిరాడు. జనం 'బాబోయ్' అంటూ చెదరై పోయారు. వెంకన్న వాణ్ణి పట్టుకొని చావగొట్టాడు. చంద్రి పక్కనే చేరి ముత్యాలుకూడా పాడుతున్నాడు. ఇద్దరూ చేతులు కలిపి ఊపుతూ పాడు తున్నారు. వెంకన్న దగ్గరికెళ్ళి 'సెంద్రీ మరోటి పాడు' అంటున్నాడు. ఎవడో వెనకనుంచి చంద్రి పైటలాగాడు. గంగడు కత్తి తిప్పుతూ నాట్యంచేస్తూ ఆమెమీద తూలిపడ్డాడు. ఇద్దరూ నేలమీద ఒకరి మీద ఒకరు పడ్డారు. జనం యీలలతో చప్పట్లతో తమ ఆనందాన్ని తెలిపారు.

అంతకుముందే వచ్చిన వీరయ్య యిదంతా చూశాడు. అసలు చంద్రి సంబరానికి వెళ్లడమే వీర య్యకి యిష్టంలేదు. అందుకే నిద్రలో ఉలిక్కిపడి లేచి యిలాగ వచ్చాడు. ఈ దృశ్యం అతనికి బాధనీ అస హ్యాన్నీ కలిగించింది. తనకీ తనవాళ్లకీ ఏదో ప్రత్యేకత కల్పించుకోవాలని అతని ఆశ. తనదైన చంద్రి వీళ్లల్లో గంతులు వేయడం సహించలేకపోయాడు. చౌదరిభార్య యిలా ప్రవర్తించదని అతనికి దృఢంగా తెలుసును.

'సెంద్రీ ఇలాగరాయే' అని గట్టిగా కంఠమెత్తి పిలిచాడు.

'నాను రాను' అంది చంద్రి ఉత్సవపు ఉత్సా హంలో.

'సంపేత్తా రాకపోతే' అంటూ ఆమె చెయ్యి పట్టుకు లాగాడు.

'ఒగులోదులు యీరయ్యా బావా నొప్పి పెడుద్ది' అంది చంద్రి. అందరూ చప్పట్లు కొట్టారు.

చంద్రికి అభిమానంవేసింది. కదలనంది. మొరాయించింది. వీరయ్య ఆమెను జుట్టుపట్టుకుని బరబర లాక్కుపోయాడు 'గ్యానం నేదూ నీకు? జుత్తువోదులు' అంది కోపంతో చంద్రి. వీరా వళ్ళు కోపంతో మండుతున్నాయి. 'నామాటినకపోతే జాగర్త! ఎదవ్వేసాలెయ్యక' అన్నాడు.

'నే యినను' అంది చంద్రి.

'పో—ఆ వెంకన్నతోపో' అన్నాడు వీరయ్య కోపంగా.

'ఆడికేం, ఎంకన్న మంచివాడు' అంది చంద్రి కొంటెగా.

వీరయ్య అమెమీదకి దుమికాడు. చంద్రి పరుగెత్తింది. వీరయ్య వెంబడించాడు. సముద్రం వొడ్డుకి వచ్చారు. చంద్రి ఫక్కున నవ్వింది.

'ఏంటీ నవ్వుతావ్?' అన్నాడు వీరయ్య.

చంద్రి యిసుకమీద కూర్చుని పాదాల్ని కెరటాలలోపెట్టింది. ఓరగా వీరయ్య కేసిచూసి 'వెంకన్న పెద్దమడిసి. అందమైనోడు' అంది. ఆమె పిక్కలు నురుగుతో నవ్వుతూన్నట్టున్నాయి. వీరయ్య ఆమెని నీళ్లలోకి తోశాడు. చంద్రి గల్లున నవ్వుతూ నీళ్లల్లో పడింది.

'రా పైకిరాయే పిల్లా' అన్నాడు వీరా.

తడిసినచీరతో పైకి వచ్చింది చంద్రి. స్ఫుటంగా ఉన్న అవయవాల పొంకంచూసి ఆమెను కౌగలించుకోబోయాడు వీరయ్య. ఆమె తప్పించుకుని మళ్లీ నీళ్లల్లోకి దుమికింది. నీరు గలగలమంది. వీరా గొంతునిండా నవ్వాడు. చంద్రి తిరిగీ ఒడ్డుమీదకు వచ్చింది.

'ఒళ్లు గడ్డైపోతుంది. ఉహు చలి చలి' అంది ఒణుకుతూ. వీరయ్య తలగుడ్డతీసి ఆమెమీదను విసిరాడు. 'కట్టుకో' అన్నాడు.

'మరు గేది యీరయ్య బావా?. నాను సిగ్గులేని నర్సమ్మ నేంటీ' అంది చంద్రి. వీరా పక్కకితిరిగి కళ్లు మూసుకున్నారు. చంద్రి ఆగుడ్డని చుట్టబెట్టుకుని సరీసరిపడని పైటవేసుకుంది. తడిసిన జుట్టు చివరల్ని సాచి ఆరబెట్టు కుంటోంది.

వెన్నెలలో అర్ధనగ్నంగా ఉన్న ఆమెదేహమూ రూపమూ మోహనంగా ఉన్నాయి. వీరయ్య రెప్ప వెయ్యకుండా ఆమెకేసి చూశాడు. ఆమెని పట్టుకోబోయాడు. ఆమె పరుగెత్తింది. అలసిపోయి యిసుకలో వాలింది. వీరయ్య అమెని రెండు చేతుల్లోకి తీసుకుంటూ 'నువ్వు నాదేవతవు సెందిరీ' అన్నాడు.

సముద్రపు కెరటాలహోరు చిత్రంగా మిస్టిక్ గా వుంది. దూరంగా సంబరం డప్పుల మోత వినబడుతోంది.

6

పల్లెపల్లె అంతా వీరాకి వ్యతిరేకంగా వుంది: వీరాదగ్గర సొమ్ము నిలవవున్నట్టు అందరికీ తెలిసింది. చౌదరి జనాన్ని వెంటబెట్టుకుని నూకాలమ్మ గుడి కట్టించడానికి యిరవై రూపాయలు చందా యిమ్మన్నాడు. ఇవ్వ నన్నాడు వీరయ్య. ఎన్నో విధాల చెప్పిచూశారు చౌదరీ, తక్కిన వాళ్లూ. చచ్చినా యివ్వనన్నాడు వీరయ్య. 'నువ్వు దేవతని కాదంటున్నావు. నాశన మైతావ్' అన్నా డొక భక్తుడు. వీరయ్య చలించలేదు. చౌదరి ఎర్రగా ముఖాన గంటు పెట్టుకుని వెళ్లిపోయాడు. ఊరంతా అనేకవిధాల చెప్పుకున్నారు. వీరయ్యని తిట్టుకున్నారు. దరిద్రం తనపక్కన - తనలో - ధనచిహ్నాల్ని ఉండనివ్వదు. బానిసలైన అమాయకులైన అవిద్యాపరులైన ప్రజలు తమ దరిద్రాన్ని జాగ్రత్తగా కాపాడుకుంటూవుంటారు.

చీకటిరాత్రులు కాబట్టి చంద్రి రోజూ రావడం లేదు. ఎప్పుడేనా వచ్చినా చీకటిపడకుండా వెళ్లిపోతోంది. అప్పలమ్మ వీరయ్యయింటికి రోజూ వస్తూ పోతూవుంది. వీరయ్యను మంచిచేసుకుంటోంది. సెనగచ్చులు తెచ్చిపెడుతోంది. డబ్బిచ్చినా తీసుకోలేదు.

తనంటే విరోధంగా ఉన్న పల్లెవాళ్లంటే అసహ్యంతో మరీ దూరంగా వుంటున్నాడు వీరయ్య. గవరయ్యమామ చచ్చిపోయాడు. అందరికీ ఆశ్చర్యం కలిగేటట్టు దహనానికీ తంతుకీ అయే ఖర్చంతా వీరయ్య భరించాడు. సీతాలుని తనయింటికి వచ్చి ఉండమన్నాడు కాని సీతాలు ఎవరితో చెప్పకుండా పల్లె విడిచి వెళ్లిపోయింది. వీరయ్య కొన్నాళ్లు వరుసగా వెళ్లి మామగుడిసెలో దీపం పెట్టివచ్చేవాడు. ఇప్పుడు కొన్ని పందులూ పందికొక్కులూ ఆగుడిసెని విశ్రాంతి భవనంగా వాడుకుంటున్నాయి.

వీరయ్యపట్టుదల ఆనాటి కానాడు ఎక్కువయింది. దేహశ్రమని లెక్కపెట్టకుండా సముద్రాన్ని గాలించేస్తున్నాడు. ఎన్నో రోజులు ఫలితంలేకండా పోయేవి. బాధతో వొంటి నొప్పులతో తిరిగివచ్చేవాడు. ఒక్కొక్కరోజున చేపలు కొల్లలుగా పడుతున్నాయి. ప్రతీచేపకీ లెక్క

కట్టి నిలవ వేస్తున్నాడు. ప్రతీరోజూ తనదగ్గరున్న సొమ్ము లెక్క పెట్టుకుంటున్నాడు. డబ్బుని తన మొల లోనే పెట్టి చుట్టూ గుడ్డని చుట్టబెట్టుతున్నాడు. అడవిలో తన ఆహారాన్ని జాగ్రత్తపెట్టుకునే ఖడ్గమృగం లేక ఎలుగుబంటి వంటి ప్రవృత్తి అతనిలో దళంగా వ్యాపించింది. నూకయ్యకి యిజార్లు కుట్టించలేదు. బాబుకి దుప్పటీ కొనలేదు. చంద్రికి చీరనీ కొనిపెట్ట లేదు. 'అన్నంతా సేసితీర్తాను. అప్పుడుగాని ఒక్క దమ్మిడీ ఖర్చుపెట్టను' అని చెప్పాడు చంద్రితో.

ఆ సముద్రంవంటిదే దరిద్రం కూడా. అవతల వొడ్డు కనపడదు. కాని వీరయ్య మొండిగా ముందుకు సాగిపోతున్నాడు.

7

కన్ను కనపడని చీకట్లో పల్లె భయంకరంగా వుంది. సముద్రపు హోరు క్షయరోగంతో బాధపడుతూన్న రాక్షసుడి శ్వాసలాగా వుంది. చిరిగిన పాత కంబళీ చిరువెచ్చని మడతల్లో వీరా నూకయ్యా గాఢంగా నిద్రపోతున్నారు. చలిగాలి చూరుని కొట్టుకొని వెనక్కి మళ్లుతోంది.

ఎవరో గుడిసె తలుపును డబడబ బాదుతూన్నట్టు చప్పుడయింది. 'యారదీ' అంటూ వీరయ్య లేచి తలుపు తీశాడు. చౌదరి పెద్ద చుట్టకాలుస్తూ బండమీద కూర్చున్నాడు. పక్కనే గుమాస్తా నౌకరూ చేతులు కట్టుకుని వున్నారు. నౌకరుచేతిలో లాంతరు వుంది. వెంకన్న చేతిలో మరో లాంతరు వుంది.

'శేతిరేల ఒచ్చారు బాబుగారు' అన్నాడు వీరయ్య కంగారుగా నిద్రని దులుపుకుని.

వెంకన్న దీపం మొహంమీద పెట్టి 'నీకోసమే' అన్నాడు.

'సర్కారువారికి నీమీద చాలా కోపంగా వుంది' అన్నాడు చౌదరి తాపీగా.

'ఏం బాబూ?'

'క్రితం ఏడాది పన్నంతా బకాయీవుంది. వృత్తిపన్నూ గుడిసెపన్నూ కూడా. జుల్మానాతో యిచ్చుకోవాలి' అన్నాడు చౌదరి.

'మాబాబు పన్ను కట్టేశినాడండి. నాను యీ యేడాది సొంతంగా చూసుకుంటున్నాను' అన్నాడు వీరయ్య.

'మీ బాబు ఎప్పుడూ రాగిపైసా కట్టలేదు. నాకు తెలుసు' అన్నాడు వెంకన్న.

'జుల్మానాతో యిరవైఆరు రూపాయలయింది' అన్నాడు చౌదరి.

'అన్నాయం బాబూ. మాబాబు పన్ను కట్టేశానని నాతో చెప్పాడండి.'

'అయితే నేనబద్ధమాడానంటావా?' గద్దించాడు చౌదరి.

'మా బాబుకూడా నిజాయితి మనిసేనండి' తొణక్కుండా అన్నాడు వీరయ్య.

చౌదరి గుమాస్తా పేరిశాస్త్రికేసి చూశాడు. పేరిశాస్త్రి 'అయితే రసీదులేవీ?' అని అడిగాడు.

వీరయ్య తెల్లబోయాడు. రసీగులు తీసుకునే అలవాటు ఎప్పుడూ లేగు, చౌదరిలేచి యిలా అన్నాడు. 'నువ్వు ఉదయమేవచ్చి పన్ను జుల్మానాతో కట్టెయ్యాలి. లేకపోతే వీలులేదు. తరవాత ఏంజరిగినా విచారిస్తావు.'

గుమాస్తా దాన్ని వ్యాఖ్యానించాడు. 'సర్కారువారు నీగుడిసెనీ నీకున్న యావదాస్తినీ స్వాధీనంచేసుకుంటారు.'

చౌదరి వెళ్లిపోయాడు. వెంకన్న కొంతదూరం వెళ్లి తిరిగి వచ్చాడు.

'ఇదుగో యీరయ్యా. నామాటిను. ఓపదిరూపాయలు నాకియ్యి సౌదరిబాబుతో సెప్పి రైటుసేస్తాను' అన్నాడు మీసం తిప్పుతూ.

'నిన్నూ ఆసౌదరినీ సేపలకూరలా తరిగేత్తాను' అన్నాడు వీరయ్య మండిపడుతూ. అతనిగొంతులోని కాఠిన్యానికి జంకి వెనక్కితిరిగాడు వెంకన్న.

తర్వాతరోజున ఉదయమే బయలుదేరి వీరాబాబు ఉంటూన్న ఊరికి వెళ్లాడు. అక్కడకు చేరేటప్పటికి నడినెత్తిమీదకు సూర్యుడొచ్చాడు. కీళ్లనొప్పులతో బాధలతో శల్యావశిష్టుడైన బాబు యిలాగ అన్నాడు. 'పన్నుకట్టేశానురా అబ్బి. కాని ఆసౌదరి మా పెమాదం మనిషి. సాటుగాపోయి ఓపదిరూపాయలు యిచ్చుకుని రచ్చించమని అడుగు. లేకపోతే పొంపగపట్టి నిన్ను బతకనివ్వడు.'

తనకి అవ్యక్తంగా ఆదర్శంగా ఉంటూన్న చౌదరి యిలాంటివాడని తెలియగానే తనమీద తనకే రోతపుట్టింది వీరయ్యకి. ఏమైనా బాబుచెప్పినట్టే చేసి యీగండం దాటాలని సంకల్పించుకున్నాడు. బాబుకి అలాగే చేస్తానని వాగ్దానం యిచ్చాడు. బాబు భోంచేసి వెళ్లమన్నా ఆగలేదు. సత్తెమ్మ వండినకూడు తినకూడదనుకున్నాడు. ఎండలోనే బయలుదేరి సాయంత్రానికల్లా తనపల్లె చేరుకున్నాడు వీరయ్య.

చీకటి పడుతూ పడుతూ వుంది. గుడిసెముందు నూకయ్య కూర్చుని ఏడుస్తున్నాడు. అలసటతో ఉన్న

వీరన్న కోపంతో అడిగాడు. 'ఎందుకురా యేడుస్తావ్? ఎవరు వచ్చినార్రా?'

'సౌదరీ ఆళ్ళూ ఒచ్చి సేపలు తీసుకుపోనారు' అన్నాడు నూకయ్య ఏడుస్తూనే.

వీరాకి గుండె ఆగినట్లయింది. మూడురోజుల నుంచి పట్టిన చేపలు జాగ్రత్తచేసి వుంచాడు. రేపే వర్తకులు వస్తారు. మూడురోజులు తిండైనా తినకుండా ఎండలో సముద్రంలో వెతికివెతికి పట్టాడు. చాలా ఖరీదుచేసే చేపలు. వీరారక్తం వేడెక్కింది. కళ్ళచివర ఎర్రజీర నాట్యమాడింది. 'ఇదేంటో తేల్చుకుని వత్తానుండు' అంటూ గుడిసెలోకి అడుగుపెట్టకుండానే వెనక్కి తిరిగాడు.

'ఓ అప్పీ-కల్లోత్తావా?' అన్నాడు వీరయ్య.

అప్పలమ్మ తెల్లబోయింది. కాని నవ్వుతూ ముంత తీసుకువచ్చి ఇచ్చింది. సగంతాగి వికారపెట్టి ముంత నేలకేసి కొట్టాడు వీరయ్య—'పో యెదవ ముండా—యెదవకల్లూ నువ్వూ' అంటూ చర చర వెళ్ళిపోయాడు. బలిష్ఠమయిన అతనివొళ్లు వణకడం చూసి ఏదో ఉపద్రవం రాబోతోందని గ్రహించి నవ్వింది అప్పలమ్మ.

తుమ్మచేలు దాటగానే చౌదరీ, వెనకాల గుమాస్తా కనపడ్డారు. వీరయ్య ఒక తుమ్మకర్ర విరిచాడు. వెనకాలే వెళ్లి 'నా సేపలు తీసుకుపోయావురా దొంగ నా కొడకా' అంటూ చౌదరి తలమీద కొట్టాడు. 'అమ్మో' అంటూ చౌదరి నేలమీద కొరిగాడు. 'చచ్చిపోయాడు మునసబు' అంటూ పేరిశాస్త్రి పెద్ద పెద్ద కేకలు వేస్తున్నాడు.

వీరయ్య పరుగెత్తుకుని అప్పలమ్మ ఇంటికి వచ్చాడు. 'అప్పీ-సౌదరిని తల పగులగొట్టా' నంటూ చతికిలబడ్డాడు. భయవిహ్వలతతో 'ఇప్పుడేంటి సెయ్యడం?' అన్నాడు ఆయాసపడుతూ.

'నీకేం భయం నేదు. నే నున్నానుగా. రా ఇటురా' అంటూ అప్పలమ్మ ఏమాత్రం కంగారు పడకుండా ఒక మూలగదిలోకి తీసుకువెళ్లింది వీరయ్యని. వీరయ్య వణకిపోతున్నాడు. 'పోలీసు లొత్తారేమో అప్పీ' అని వెర్రిగా చూస్తూ అన్నాడు.

'నేను సూత్తానంటెనిగా. భయపడమాకు. ఈ సుక్క తాగి పడుకో. బలం వస్తుంది.'

అప్పి తలుపు గొళ్లెంపెట్టి ఇవతలికి వచ్చింది. ముంత ఖాళీచేసి వీరయ్య క్రమంగా మైకంలోనికి, నిద్రలోకి జారిపోయాడు. అప్పలమ్మ ఓ గంటపోయాక గదిలోకి వచ్చింది. వీరా మొలతడిమి కట్టువిప్పి నోట్ల కట్టని సంగ్రహించి మళ్లీ తలుపు గొళ్లెంపెట్టి తిన్నగా చౌదరి ఇంటికి బయల్దేరి వెళ్ళింది.

చౌదరి పడుకుని ఉన్నాడు. తలమీద కట్టు వుంది, 'ఏంటి జరిగింది చౌదరీ' అంది. నిజంగా ప్రమాదం ఏమీ లేదు. కర్రదూసుకుపోయి బుజానికి తగిలింది. తలమీద పక్కగా చర్మం లేచింది. బుజం మాత్రం నొప్పిగావుంది.

'పోలీసుల్ని పిలిపించి వాణ్ణి చితకతన్నిస్తాను. పదేళ్లుశిక్షపడేటట్టు చూడకపోతే నాపేరు చౌదరి కాదు' అన్నాడు చౌదరి.

ఉద్రేకాలవలనకన్న తెలివివల్ల లాభం ఎక్కువుందని అప్పలమ్మ చౌదరికి బోధించింది. ఏ సమస్యలోనుంచైనా డబ్బుని ఉత్పన్నం చెయ్యడం ప్రయోజకుల లక్షణం. పోలీసుకేసువల్ల మరికాస్త డబ్బు ఖర్చవుతుంది. అంతకన్న ఓ వందరూపాయలు నష్టపరిహారం తీసుకుంటే? వీరయ్యా లొంగిపడివుంటాడు; ధనలాభమూ వుంటుంది. 'పాతికో పరకో నీకు తోచింది నాకు ముట్టచెప్పు. నాకేం ఆశలేదు' అంది అప్పలమ్మ—తన నిస్వార్థాన్ని రుజువుచేస్తూ.

చౌదరి నవ్వాడు. తనలాంటి ఉత్తమ ఆలోచనలూ, తెలివితేటలూ ఉన్నవాళ్లని గుర్తుపట్టి మెచ్చుకోగల సహృదయుడు తను. 'సరే. నీయిష్టం' అన్నాడు. అప్పలమ్మ తిరిగి తనింటికి వచ్చి గదిగొళ్లెం తీసింది. చచ్చిన దూడలా కాళ్ళూ చేతులూ పడేసుకుని నిద్రపోతున్నాడు వీరయ్య.

తెల్లవారగానే వీరయ్యకి మెలకువ వచ్చింది. భయంతో లేచాడు. చౌదరి శవం కళ్ళముందు కనపడింది. 'బాబోయి' అని కేకపెట్టాడు. గబుక్కుని వీరయ్యకి మొలనుకట్టిన డబ్బు జ్ఞాపకంవచ్చింది. చూసుకున్నాడు. లేదు. అతనిప్రాణంపోయినట్లయింది. 'ఓ అప్పలమ్మా' అంటూ కేకలు వేస్తూ తలుపులు దబదబ బాదాడు. గుంజాడు. అప్పలమ్మ వచ్చి తలుపులు తీసింది.

'అప్పీ. నా డబ్బు నా డబ్బు...' వెర్రిగా అరుస్తున్నాడు వీరయ్య.

'పోతేపోయిందిలే. బుద్ధిలేనోడా. ముందు నీ బతుకు సూసుకో. సౌదరి సావుబతుకులమద్దె ఉన్నాడు.'

అలాగే చూస్తూ నిలబడ్డాడు వీరయ్య.

'పోలీసు లొత్తారు. నిన్ను ఉరిదీత్తారు.'

అప్పలమ్మ రెండుకాళ్ల మీదా పడ్డాడు వీరయ్య. 'నన్ను రచ్చించు అప్పలమ్మా. నాకు సావొద్దు. సావొద్దు.' దీనంగా ఏడ్చాడు వీరయ్య.

'భయపడకు యెర్రోడా. నేనంతా మాట్లాడి వుంచినానులే. ఓ వందరూపాయలు తీసుకురా. నీమీద కేసు తీయించేత్తాను' అంది అప్పలమ్మ.

'వందరూపాయలే'

'కాపోతే ఉరి!'

'ఎలాగ అప్పీ. నాదగ్గర డబ్బుకూడా పోయింది. దొంగెదవ లెవరో కాజేశారు.'

'అఁ—పొలం కాడ ఎక్కడో పడిపోయివుంటది. ఏ సచ్చినాడో తీసేసి ఉంటాడు.'

'మరి ఏం సేసేది అప్పీ. నీ కాళ్లట్టుకుంటాను. దారి సూపించు.' వీరయ్య కళ్లమ్మట నీరు ఏకధారగా ప్రవహిస్తోంది.

'సెంద్రిదగ్గర నిలవ వుంటుంది. పోయి తెచ్చుకురా.'

'సెంద్రినా?'

'నువ్వు మనువు సేసుగోవా యేంటే. నీకోసమంటే అది పడిచస్తది.'

8

చంద్రి ఆడుతూ పాడుతూ యింటికి వచ్చింది. గుడిసెముందు మేనమామ రత్తయ్య చుట్ట కాల్చుకుంటూ కూర్చున్నాడు. చంద్రి గుమ్మంలో అడుగు పెడుతూనే తన్నెవరో పిలుస్తూన్నట్టు విని నలుదిక్కులా చూసింది. రేగినజుట్టుతో మాసినబట్టలతో పీక్కుపోయిన మొహంతో పొలంగట్టమ్మటే వస్తూన్న వీరయ్యని చూసింది. పరుగెత్తుకు వెళ్లింది. చంద్రిని చూడగానే వీరయ్యకి ఓపిక లేనట్టయింది. గట్టుమీద చతికిలబడి మొహం కప్పుకున్నాడు.

'ఇదేంటి యీరయ్యబావా' అంది చంద్రి. వీరయ్య మాట్లాడలేకు. చంద్రి కంగారుపడింది. తల నిమురుతూ అడిగింది.

'ఏంటి జరిగింది బావా?'

వీరయ్య తల పైకెత్తాడు. గద్గదికంగా అన్నాడు. 'నన్ను రచ్చించాలి సెందిరీ.'

ఇలా బేలగా, జాలిగా తనదగ్గరకి ఎప్పుడూ రాలేదు వీరయ్య. అతనిలోవున్న పౌరుషమూ మగతనమూ ఏమయ్యాయో తెలియదు. ఏవో కీడు శంకించింది. అయినా చిక్కబట్టి 'సొప్పు నాతో. అసలేం జరిగింది?' అంది.

'నన్ను ఖైదీలో పడేత్తారు. ఉరితీత్తారు. ఉరితీత్తే సచ్చిపోతాను.' వీరయ్య విహ్వలంగా ఉరిని తలచుకుంటూ చెప్పాడు. చంద్రి ఆశ్చర్యంగా చూసింది. అణ్ణి—ఆ సౌదరిని నెత్తి పగలకొట్టాను. పన్ను లియ్యలేదని మూడురోజులసేపల్ని తీసుకుపోయినాడు దొంగనాయాల......'

'పోవల్సిందే ఆ సచ్చినోడు...'

'నా మొలని కట్టి బద్రంసేసుకున్న సొమ్ముకూడా పోయింది. ఎంత కట్టపడ్డాను.' వీరా దుఃఖం ఆపుకోలేకపోయాడు. ఏడ్చాడు, చంద్రివొళ్లో తలపెట్టుకుని.

'ఏడవమోకు బగమంతుడే ఉన్నాడు. చంద్రికి కూడా కళ్లమ్మట నీళ్ళు తిరిగాయి. 'ఎలా అయిపోయినావ్ బావా. రెండురోజులకే సిక్కిపోయినావు. కూడు తిన్నావా.'

'నాను పడిన కట్టమంతా బూడిదైపోయింది. ఎప్పుడో సముద్రంలోపడి చచ్చిపోతాను.'

చంద్రికి భయంవేసింది. 'ఆడదానిలా యిదైపోతవేంటి. యెదవ డబ్బు పోతే మళ్ళీ వత్తది. మన రెక్కలున్నయిగా.'

'ఇప్పు డొందరూపాయలు కావాలి. లేందే పోలీసులొచ్చి లాక్కుపోత్తారు.'

'ఒంద రూపాయలే!'...చంద్రి దిగులుపడింది. శూన్యంలోకి చూస్తూ కూర్చుంది.

పచ్చని చేలు గాలికి వూగుతున్నాయి. సందె చీకటిలో పచ్చరంగు కలిసిపోతోంది. కొంత దూరంలో ఉన్న చింతచెట్టుమీద కోతులు కిచకిచమంటున్నాయి. చీకటిపడబోతూంటే వారి గుండెల్లోని భయం బరువై బరువై పోయింది. పొలాల్లో కట్టివేసిన దూడల మెడలలో మువ్వలుమాత్రం మధ్య మధ్య ఘల్లు మంటున్నాయి.

వీరా లేచాడు. చంద్రి సహాయ్యం చెయ్యలేదని వీరయ్యకి తెలుసును. అతనిలో ఏదో తెగువా ధైర్యమూ వచ్చాయి. 'నేనెల్తాను.' అన్నాడు. రెండడుగులు వేసాడు. చంద్రి చటుక్కునలేచి వీరయ్యని పట్టుకుంది. 'ఆగు బావా. రా, కూడు తిందు గాని!'

'ఒద్దు సెంద్రీ. నే పోతాను'

'నన్ను సంపుకు తిన్నట్టే. రా బావా. ఏదో ఉపాయం ఆలోచిత్తానుగా.'—చంద్రి గట్టిగా వీరయ్యను కౌగలించుకుంది. ఆమెతడికళ్ళు వీరయ్య గుండెలకి చల్లగా తగిలాయి. వీరయ్య మారు చెప్పలేదు ఆమె వెనకాలే వెళ్ళాడు.

చంద్రి మేనమామ తత్వాలుపాడే ఒక చిన్న సైజు ఆధ్యాత్మికవాది. పెళ్లాం పోయాక ముండలతోనూ, ఒళ్లు పాడైపోయాక మందులతోనూ, ఓపిక పోయాక బైరాగులతోనూ మైత్రి సంపాదించినవిఖ్యాత జీవి. ఎన్ని తత్వాలు పాడినా ఎక్కడెక్కడ తిరిగినా వేళకిమాత్రం వచ్చి కూడు తినాలనే ప్రాథమికవివేకం కోల్పోని జ్ఞాని. వీరా దిగుల్నీ బాధనీ చూసి యిలా అన్నాడు.

'ఆసొాదర్ని తిట్టకు బాబూ. ఈ ద్రేహ మశాశ్వతం. మన ఖర్మ ఎట్టాగుందో అట్టాగే జరుగుద్ది. ఈశరేచ్ఛ.'

'ఈ డెవడూ ఎర్రినాకొడుకు యేదాంతం సాపుతాడు' అన్నాడు అసలే మండిపడుతూన్న వీరయ్య.

'నీ తిట్లు నన్ను తగలవురా కుర్రోడా. ఈ ద్రేహానికే తిట్లయినా కొట్లయినా. లోపలి ఆతమ కేవీ తలగవ్.'

చంద్రి గబగబా కూడు వండిపెట్టింది. నిశ్శబ్దంగా తిన్నాడు వీరయ్య. చుట్టూరా గాలీ గోడలు బరువెక్కి గుండెమీద నొక్కుతోన్నట్టుంది వీరయ్యకి.

'పడుకో బావా. ఏదోఒకటి సూత్తాను' అంది పక్కపరిచి.

'నాకు నిదర రాదు.'

'ఊరికినే పడుకో.'

కాని వీరయ్య పడుకున్న కాస్సేపట్లోనే నిద్ర పోయాడు. రెండు రోజుల్నుండి తిండిలేక అలసి పోయాడు. మనస్సు తనకి తెలీకుండానే నిద్ర నాశ్రయించి బాధనుంచి విముక్తి చెందింది. చంద్రి దొడ్డి తలుపులుతీసి మేనమామ వినకుండా మెల్లగా అడుగులు వేస్తూ రోడ్డుమీదకి వెళ్ళి క్రమంగా వ్యాపిస్తోన్న చిరుచీకట్లోకి మాయమయింది.

తెల్లవారగానే వీరయ్యకి ఎవరో తట్టి లేపుతున్నట్టయింది. చంద్రి వీరాచేతిలో బంగారపు గొలుసు ఒకటి పెట్టింది. 'మరి తొరగా యెల్లిపో యీరయ్య బావా.'

'ఎక్కడిదిదీ'—ఆశ్చర్యంగా అడిగాడు వీరయ్య.

'సిన్నప్పట్నుంచీ నాకుంది యీ గొలుసు. అమ్మితే ఎనబై రూపాయలొత్తయ్. 'ఎల్లు ఎల్లిపో'

ఆమె తొందరనీ ఆందోళననీ గ్రహించాడు. వీరయ్య.

'నిజంగా సెందిరీ.'

చంద్రి ముఖం పక్కకి తిప్పింది. పళ్లు బిగబట్టి 'లేందే యాడిత్తాడు నాకు బంగారపు గొలుసు?' అంది.

సందేహంతో, సందేహాన్ని మించిన అవసరం యొక్క బలంతో గుప్పిటితో గట్టిగా పట్టుకుని వెళ్ళిపోయాడు వీరయ్య. చంద్రి గుడెసెలో కూర్చుని చాలా సేపు ఏడ్చింది.

'ఎందు కేడుత్తవు పిల్లా?' అన్నాడు మేనమామ.

'కడుపునొప్పి' అంది చంద్రి.

తెల్లని కిరణాలు తూర్పున తోచి గుడిసె గుమ్మాన్ని తాకాయి. చంద్రి కళ్లు మూసుకుని రెండు చేతులూ జోడించి, 'ఓ నూకాలమ్మ తల్లీ! నా యీరయ్యను రచ్చించు. నీకు కోడిపెట్టని బలియిత్తాను' అని మొక్కుకుంది.

9

రెండేళ్లు గడచిపోయాయి. అయినా సూర్యుడు తూర్పునే ఉదయిస్తున్నాడు. ఋతువులు వరుస క్రమంలోనే జరుగుతున్నాయి. రాత్రి వేళ చీకటే, పగటివేళ వెల్తురూ ఉంటున్నాయి. ఏం ఒక్కసారి మారకూడదూ అనుకుంది చంద్రి. కాని ప్రకృతియొక్క చర్యలో మార్పులేదు. నిద్రలేచేముందు అదే-అబూట్ల చప్పుడే వినపడుతుంది. కాకీదుస్తులతో టోపీలతో బాధగా పోలీసులు ఇటూ అటూ తిరుగుతూంటారు. ముసలికాకి ఎప్పుడూ ఆగోడమీదనే నుంచుని 'కావు కావు'మని అసహ్యంగా అరుస్తూంటుంది. పక్క కొట్లోంచి కొత్తగా శిక్షపడిన కుర్రాడు అస్తమానూ 'ఇది నా ఇల్లాలని' అంటూ పాడుతూంటాడు. ఎర్రని రాళ్లతో పెద్దపెద్ద గోడలు తనచుట్టూ నిలబడి ఉంటాయి. ఆగోడలు కదలవు కరగవు కబుర్లుచెప్పవు.

జైలులో ఉన్నప్పుడు మొదట ఏడ్చేది. గుండె పోటు వచ్చేటట్టు ఏడ్చేది. నిద్రపట్టేదికాదు. అన్నం సయించేదికాదు. తనవాళ్ళందరూ తన్ని హేళన చేస్తారు. గ్రామస్థులందరూ అసహ్యించుకుంటారు. ఈరోజున ఇంతకష్టంలో తనకి బాబులేడు, అమ్మలేదు. వీరా ఏమైపోతాడో! మనోవ్యథ ఎక్కువైపోయి ఓరోజున జైలుగోడలకి తలపెట్టి కొట్టుకుంది. గాయమైంది, రక్తంకారింది. పోలీసు సుబ్బారావు తిట్టాడు.

'సచ్చిపోతావ్.'

'సావడానికే.'

జైలులో ఉన్నన్నాళ్ళూ చాలావిషయాలు తెలుసుకుంది. పోలీసులంటే మనుషులనీ, వాళ్ళల్లోనూ మంచివాళ్ళున్నారనీ తెలుసుకుంది. వార్డెన్ సుబ్బారావు ఎప్పుడేనా ఇంటిదగ్గర చేసుకున్న మినపరొట్టె, జంతికలులాంటివి తీసుకొచ్చి తనకి పెట్టేవాడు. తను ఏడుస్తూవుంటే కబుర్లుచెప్పి ధైర్యం చెప్పేవాడు. సూర్యుడు తూర్పున ఉదయిస్తాడని తెలుసుకుంది. తెల్లవారగానే లేచి పరీక్షగా చూసేది. చాలాసార్లు పడమట ఉదయించకూడదా అని కసురుకుంది. తన అసంతృప్తిని వార్డెన్ సుబ్బారావుకు తెలియజేసింది. 'సూర్యుడికి బుద్ధిలే'దన్నాడు సుబ్బారావు.

రోజూ మూడుపూటలా కటకటాల్ని లెక్కపెట్టేది. పాతసంగతులన్నీ తలచుకునేది. కామందుల విధవకూతురు సుబ్బమ్మకూడా జైల్లోపడితే బాగుండును. గచ్చనకాయ లాడుకోవచ్చునుగదా అనుకుంది. చివరికి తన్ని వీరా ఎప్పటిలాగే గౌరవిస్తాడనీ, మనువు చేసుకుంటాడనీ, భూమ్మీద యిటుకలతో ఇల్లుకడతాడనీ—ఆశ, ఆ ఆశనే ఆహారంకింద, బలంకింద, ప్రాణంకింద మార్చుకుని బ్రతికింది.

కాని ఆమె మారిపోయింది. రెండేళ్లల్లో క్రమంగా ఆమె నవ్వడం మరచిపోయింది. ఆమె బుగ్గల్లో కళ్లల్లో వుండే నిండైన ఆరోగ్యపు నిగనిగ పోయింది. చాతకాని నలిగిపోయిన వడలిపోయిన ఉదయపు కల్వపువ్వులాగ నీరసంగా నీరవంగా అయిపోయింది.

జైలునుంచి యివతలకి రాగానే ముందుకు నడవలేకపోయింది. అక్కడే కూర్చుని ఏడ్చింది. చిన్నమూట చేత్తో పట్టుకుని సముద్రంవొడ్డున ఉన్న వీరయ్య పల్లెకి బయల్దేరింది. వార్డెన్ సుబ్బారావు చేతికొక పావలా యిచ్చి ఏదేనా కొనుక్కు తినమన్నాడు.

ఎర్రని కంకరరోడ్డుమీద దుమ్ములేచి ముక్కులోకీ కళ్లల్లోకీ పడుతోంది. రోడ్డు ఎండకి కాలి కాలికి చుర్రుమని తగులుతోంది. కాళ్లు నొప్పిపెడుతున్నాయి.

తన పక్కనుంచి కార్లూ జట్కాబళ్ళూ దూసుకుపోతున్నాయి. రకరకాల జనం యిటూ అటూ పోతున్నారు. వాళ్ళందరూ తన్ని చూసి 'దొంగ దొంగ' అని అరుస్తారేమో అని భయపడింది. ఓ చెట్టుకింద కాసేపు కూర్చుని విశ్రాంతి తీసుకుంది. రోడ్డు వారనే ఉన్న చిన్నకొట్లో ఏవో కొనుక్కు తిని యిన్ని మంచినీళ్లు తాగింది.

సాయంత్రానికి పల్లె చేరుకుంది. పల్లెబహిః ప్రకృతిలో మార్పులేదు. గుడిసెలు, నల్లని చిక్కని పల్లెజనమూ, అప్పలమ్మ యిల్లూ, రావిచెట్టూ - అన్నీ అలాగే ఉన్నాయి.

'ఓస్ - యారదీ సెంద్రమ్మ ఏంటీ?'

చంద్రి పక్కకి చూసింది. మీసాల వెంకన్న ఒంటికాలితో నుంచున్నాడు. చంకల కింద ఆసరాగా రెండు గుడ్డలు చుట్టిన కర్ర లున్నాయి.

'యీరయ్య ఉన్నాడా?' భయంగా అడిగింది చంద్రి.

బొంగురుగా నవ్వాడు వెంకన్న. కన్నుగీటి 'రాయే పిల్లా' అన్నాడు. కాలు విరిగినా కామం విరగ లేదు వెంకన్నకి.

తొందరగా వీరయ్య గుడిసెదగ్గరకి వెళ్లింది. ఈలోపుగా ఎందరు పిలిచినా పలకలేదు. 'నీ యీరా లేడు' అన్న గంగడిమాటనీ లక్ష్యంచెయ్యలేదు. గుడిసె అంతా శిథిలమై ఉంది. లోపల నారయ్యా, చౌదరికొడుకు సూరయ్యా చుట్టలు కాలుస్తున్నారు. చంద్రిని చూసి నారయ్య 'ఇదిగో—ఇదే యీరయ్య ముండ. ఉత్తి దొంగముండ' అన్నాడు. సూరయ్య పన్నెండేళ్ళ కుర్రాడు లేచి ముంగుకువచ్చి 'ఎవర్ నువ్వ' అన్నాడు.

'నాను సెంద్రిని. ఇక్కడ యీరయ్య ఉంటం లేదూ?'

'నీ యీరయ్య సచ్చిపోయాడు' అన్నాడు సూరయ్య. 'పో పో' అని కసిరాడు.

'అన్నాయం. ఉత్తిదే. సావనేదు' అన్నాడు నారయ్య.

చంద్రి నిట్టూర్చి వెనక్కి తిరిగింది. కాని సూరయ్య ఆమెని పిల్చాడు.

'నీకు కూడుందా?' అన్నాడు.

'లేదు' అంది చంద్రి.

'నేను సుట్టలు కాలుత్తున్నానని బాబుతో సెప్పకేం—'

'సెప్పనులే—'

'నువ్వ నిజంగా యీరయ్య ముండవేనా?'

చంద్రికి అంత బాధలోనూ నవ్వొచ్చింది.

'రెండురూపాయ లిత్తాను కావాలా' అన్నాడు చాదరి కొడుకు. చంద్రి ఆశ్చర్యంగా చూస్తోంది. రెండు రూపాయలుతీసి మోగించి. 'ఇవిగో. మరి నాతో వత్తావా?' అన్నాడు చాదరి కొడుకు. ఈ పసికుర్రవాడి మాటలకి జాలీ అసహ్యమూ రెండూ కలిగాయి చంద్రికి. వాడిమాట లక్ష్యం చెయ్యక 'మీ బాబు ఏంచేత్తున్నాడు?' అని అడిగింది.

'యెదవబాబు. పచ్చవాత మొచ్చి పడుకున్నాడు. సస్తే కానీ యియ్యడు. నేను దొంగతనంగా ఎత్తుకొస్తా.'

'ఇప్పుడు కొంచెం నయమేలే. నడుత్తున్నాడు' అన్నాడు నారయ్య.

'అప్పలమ్మ వుందా?'

'ఆఁ! ఇంచక్కగా వుంది.' అన్నాడు సూరయ్య.

'యీరయ్య ఏమయ్యాడో నిజం సెప్పు.'

సూరయ్య సముద్రంవైపు చూపించి 'అందులో పడిసచ్చాడు.' అన్నాడు.

'ఉత్తి దుత్తిది. అమద్దె నిక్కడి కొచ్చాడు. నాను చూసాను.' అన్నాడు నారయ్య.

చంద్రి సముద్రంవైపు చూసి భయంతో కళ్లు మూసుకుంది. వడివడిగా అప్పలమ్మయింటికి వెళ్లింది. అప్పలమ్మ యిల్లు చాలా మారిపోయింది. గోడలకి సున్నమూ, పైన కొత్త పెంకూ, టేకుతో చేసిన గుమ్మాలూ కిటికీలూ, కలకలలాడుతూంది. ఇంకో రెండు మూడు గదులుకూడా కట్టించింది. అప్పలమ్మకి కొంచెం వొళ్లువచ్చింది. గ్లాస్కో చీర కట్టింది. చంద్రిని చూసి ఏడ్చినంత పని చేసింది.

'యీరా ఎక్కడున్నాడప్పీ?'

'అబ్బో శానాదూరం. రెండుకోసులు నడవాలి.'—ఏదో వూరుపేరు చెప్పింది. గుడివెనక సందులో ఉన్నాడనీ చెప్పింది. అప్పలమ్మ ఆగమన్నా ఆగకుండా చంద్రి వీరా వున్న గ్రామానికి బయలుదేరింది. 'తిరిగొత్తే తిన్నగా యిక్కడికి రా సెంద్రీ. నా యాపారం సూసి పెడుదువుగాని' అంది అప్పలమ్మ ప్రేమతో.

రాత్రి పదిగంటలయింది. ఊరి పొలిమేర సమీపించింది. కుక్కల మొరుగులూ, నక్కలకూతలూ చీకట్లో భయంకరంగా ఉన్నాయి. గుండెలు దడదడలాడుతున్నాయి. గొంతు ఎండిపోతోంది. రోజంతా తిండిలేదు. పైగా నడక - విరామంలేని నడక. కాని యింతశ్రమా వీరా ఒక్కసారి తియ్యగా పిలిస్తే కాగలించుకుంటే పోతాయనుకుంది. పొలాల్లో పడుకున్న రైతుల్ని గుడికి దారి అడిగింది. వీరయ్యయిల్లు సందు చివర వుందని చెప్పారు.

ఆతురతతో ఆశతో అలసటతో చివరిగుడిసెని సమీపించింది. అక్కడ దుర్వాసన భరించరానిదిగావుంది. తరిగిపారేసిన మాంసంముక్కలు కాలికి జిడ్డుగా తగిలాయి. కొలదిదూరంలో చెట్టుకింద యానాదివాళ్లు తప్పతాగి తందనాలాడుతున్నారు.

క్షీణస్వరంతో "యీరయ్య బావా" అని పిలిచింది. లోపల్నుంచి కేకలు వినవస్తున్నాయి. "నాకు లేదేం కూడియ్యాల! నువ్వు తినేసి పడుకున్నావా దొంగ ముండా" ఆడది ఏదో తిట్టింది. కొట్టిన చప్పుడు. "అమ్మో!" అని ఆడదాని కేక. "రత్తంకూడా కారుతుందిరోయ్ సచ్చినాడా" మళ్లీ ఘోరమైన నిశ్శబ్దం.

ఈసారి చెంద్రి గట్టిగా పిలిచింది. 'యీరయ్య బావా' అని తలుపుకొట్టింది. తలుపు తెరచుకొని వీరయ్య యివతలకి వచ్చాడు. గడ్డం అసహ్యంగా పెరిగింది. చిరుగుల ఎర్రపంచె ఒకటి కట్టుకున్నాడు. వెన్నెలపడిన మొహంమీద నల్లనిమచ్చలు ఉన్నాయి. గుడ్లు లోతుకుపోయాయి.

త్వరలో

పుస్తక రూపమున వెలువడనున్నది.

'80 రోజులలో - ప్రపంచ యాత్ర'

జూల్స్‌వెర్న్ రచించిన

'ఎ రౌండ్ ది వరల్డ్ ఇన్ యైటీ డేస్'

అను మహత్తర నవలకు అనువాదము

అనువాదకుడు

బెహరా భాస్కరరావు

ఆమదాలవలస.

"యారదీ?" అన్నాడు బొంగురుగా. కంఠధ్వని మారిపోయింది. రంపంతో బండరాయిమీద గీసుతున్నట్టుంది.

"నాను సెంద్రిని. నన్ను మరిసావా నా యీరయ్యబావా?"

వీరా మాట్లాడకుండా లోపలికి వెళ్లి గుడ్డిదీపం ఒకటి తీసుకువచ్చి పరీక్షగా చూశాడు. పిచ్చిగా చూశాడు. 'ఖైదులోంచి ఇడిశారా?' అన్నాడు కాస్సేపాగి.

'ఎలా అయిపోనావ్ నా యీరా. ఎలా అయిపోనావ్' చంద్రి ఏడ్చింది.

వీరయ్య పెద్దగా దగ్గి యింకోవైపు చూస్తూ నిలబడ్డాడు.

'లోపల అదెవత్తె?' అంది చంద్రి.

'నరసమ్మ. గంజికాచిపోత్తంది.'

చంద్రి ఒక్కసారి కూలబడింది. కొంతసేపటికి మాట కూడదీసుకొని 'నేనెల్లి పోతాను' అంది.

వీరా మాట్లాడలేదు.

చంద్రికి దుఃఖం వచ్చింది. 'నా కాకలేత్తంది. నిన్నటినుంచీ కూడు నేదు.'

వీరా గొణిగాడు. 'నాకే కూడు లే దియ్యాల.'

లోపల్నుంచి నరసమ్మవచ్చి చూసింది. తలకి కట్టువుంది. 'సెంద్రమ్మ వచ్చిందీ. ఇంకేం యిద్దరూ కొంపమీదపడండి. దాన్ని తగిలెయ్యి. లేందే గుమ్మంలో అడుగెట్టనివ్వను' అంటూ భళ్ళున తలుపులు వేసేసింది.

వీరా లేచి చంద్రిని రమ్మన్నాడు. చంద్రి వెనకాలే వెళ్లింది. ఊరవతల పాక దగ్గరకెళ్ళారు. అక్కడున్న ఒక లావుపాటివాడితో 'ఇద్దరికీ సుక్కపొయ్యి. తరవాత యిత్తాను డబ్బులు' అన్నాడు. లావుపాటివాడు సందేహించాడు. ఏమనుకున్నాడో ఏమో రెండు కుండలతో కల్లునీ మాంసాన్నీ యిచ్చాడు.

చంద్రి తాగనంది. 'ఛీ ఛీ!' అంది.

'తాగు సెంద్రీ లేందే సచ్చిపోతావు' అన్నాడు వీరయ్య. చంద్రి నోట్లో బలవంతంగా పోశాడు.

ఇద్దరూ తూలుతూ పొలంగట్టుమీదకి వచ్చి కూర్చున్నారు. సప్తమినాటి వెన్నెల బూడిదలాగా వుంది.

'నీకోసం పల్లెకి యెల్లాను.' అంది చంద్రి.

వీరా దగ్గాడు.

'ఏమైపొయ్యావో అని అడలిపోయాను.'

'సముద్రంలోపడి సచ్చిపోదామనుకున్నాను. కాని...సావ నేదు.' తూలుతూ మళ్ళీ అన్నాడు 'సచ్చిపో నేదు.'

'మరి మన యిల్లుమాట ఏంటీ యీరయ్యబావా?' అంది చంద్రి గొంతులో వికారాన్ని అణచుకుంటూ.

'ఉత్తది. అంతా ఉత్తది. మనం యింతే. యిలాగే ఉంటాం. యెదవ ఆశ...అంతే.'

'అంతేనా...' వెర్రిగా నవ్వింది చంద్రి. 'మరి నే నేంటి సేసేదీ. ఎక్కడికి పోయేదీ.'

'ఈడ నే వుండు. కల్లోయిత్తాను రోజూ.'

చంద్రికి మత్తువచ్చింది. యెక్కిళ్ళమధ్య యిలాగ అంది. 'పోలీసు సుబ్బారావు బలేగున్నాడు.'

గట్టుమీద చంద్రి పడుకుంది. పమిట జారిపోయింది. నురుగు కారే నోటితో అస్పష్టంగా యిలా పాడింది.

'పోలీసు సుబ్బారావు నా జబ్బ పట్టుకుని
మాలీసు సేసాడు. మరేంట్లో సేసాడు.'

'హహహ...' వీరా బొంగురుగా నవ్వాడు. దగ్గాడు.

చంద్రికి పూర్తిగా మైకం కమ్మింది. నిద్రపట్టింది. అంతా నిశ్శబ్దంగావుంది. వెన్నెట్లో చంద్రి దేహం అర్ధనగ్నంగా మెరుస్తోంది. వీరా కొంచెం వంగి ఆమెని చూశాడు. నిదానించి చూశాడు. తన వణికే చేతులతో ఆమె చిక్కిన బుగ్గలు మెల్లగా రాశాడు. కళ్లు మూసుకుని బాధగా బొంగురుగా అన్నాడు. 'నా సెందిరీ! నా సెందిరీ!'

అక్కడికి సముద్రపు కెరటాల హోరు వినపడడం లేదు. అది అంతటా పరచుకున్న నల్లని పచ్చని భూమి. కోట్లకొలది జనానికి తల్లిలాగా ఆధారంగా ఉన్న భూమి. చంద్రి నిద్రట్లో కలవరిస్తోంది. 'నాను గొలుసు తియ్య నేదు......'